# సాక్షి
## మానవ హక్కుల నిఘా

NEWSLETTER - 18 BI MONTHLY FOR PRIVATE CIRCULATION ONLY APRIL- MAY : 2008

**మన హక్కుల్ని అన్యాయంగా అపహరించిన వారి నుండి తిరిగి పొందడానికి యాచన, విజ్ఞప్తుల వలన ప్రయోజనం లేదు దీనికి నిరంతర పోరాటమే శరణ్యం.**



# దళిత హక్కులు - ప్రచార ప్రాముఖ్యత

...✍ - వి. నందగోపాల్

కాలం పరుగెడుతోంది, సమాజం కాలంతో పోటీ పడి మరింత వేగంగా పరుగులు తీస్తూ వుంది. రోజు రోజుకూ వూహించని మార్పులు మనలను ఆశ్చర్యంలో ముంచేస్తున్నాయ్. ప్రపంచమార్కెట్‌లో భారత్ ప్రగతి అమోఘం అంటున్నారు. ప్రపంచంలోని అత్యధిక ధనవంతుల జాబితాలో ఎందరో భారతీయులు చేరి పోయారు. భారతదేశపు మధ్య తరగతి యువత తమ వ్యూహా సౌధాలను నిజం చేసికోవడానికి తగిన విద్యా, వృత్తుల కోసం ప్రపంచం నలుమూలలకు ఉరకలు తీస్తూ వుంది. ఇది వెలిగి పోతున్న భారత్. నాణానికి మరోవైపు భిన్నమైన చిత్రంఅది వెలసి పోతున్న భారత్. ఆకాశాశన్నంటుతున్న తిండి గింజల ధరలు. అందుబాటు కాని వాణిజ్య విద్యలు అడుగంటుతున్న వృత్తి, పనులు ఆదుకోలేక పోతున్న ఉపాధి అవకాశాలు. ఇది పేదల భారత్, దళితుల భారత్. గ్రామీణ భారత్. మీ కోసమే తయారౌతున్నామన్న చట్టాలు, అందలమెక్కిస్తామని వస్తున్న ప్రభుత్వ పథకాలు, ప్రకటనల్లో చూస్తున్న పావలా వడ్డీ కోట్ల రుణాలు, సబ్ ప్లాన్ బడ్జెట్లు ఏమీకూడా దళితుల జీవితాలలో సంతోషాన్ని నింపే మార్పును తీసుకొని రాలేకపోతున్నాయి ఎందుకు? ఇచ్చేవారికి, పుచ్చుకొనే వారికి, ఇరువురిలోనూ ఆలోచనా దక్పథంలో మార్పు రానంత వరకూ ఇది సాధ్యం కాదు. ఇది దానమూ కాదు. జాలీ కాదు. ఇది బాధ్యత, ఒకహక్కు.

ఏ వ్యక్తి అయినా ఇది తన హక్కు అని తెలుసుకోనంత కాలం తనముందు జరుగుతున్న అక్రమాలను ప్రశ్నించ లేరు. ఇతరులు తన పట్ల చూపుతున్న తేలిక దృక్పథాన్ని ఎదుర్కొన లేరు. ఎన్ని చట్టాలున్నా, ఎన్ని అవకాశాలున్నా, నిచ్చెనమెట్ల కుల భారత్‌లో దళిత బహుజనులకు న్యాయం ఆమడ దూరంలో అందని ద్రాక్షపళ్లుగానే వుంటాయి.

అందుకే నేడు దళితులకు, స్త్రీలకు, పిల్లలకు తమ హక్కులపై అవగాహన కావాలి, చైతన్యం కావాలి, హక్కుల సాధనా శక్తి కావాలి. పొద్దస్తమానం పొట్టకూటి పాట్లకే సమయం చాలని బడుగు జీవులకు హక్కుల గురించి తెలిసికొనే సమయం ఎక్కడ ఉంది? సాధించుకునే శక్తిని మార్గం ఎలా తెలుస్తుంది? మనసుంటే మార్గముంది అన్నట్టు, ఇది ముఖ్యం అని గుర్తిస్తే, మార్గాలు వెతుక్కోవచ్చు. శక్తి యుక్తులు సంపాయించుకోవచ్చు.

వార్తలను మనం వెళ్లి వెతుక్కోవడం లేదే, ప్రతి రోజూ, ప్రతిక్షణం మనకు అవి అందుబాటుకావడంలేదా? అలాగే హక్కుల గురించి సమాచారాన్ని గ్రామీణ దళిత బహుజనులకు అందుబాటులోకి తీసుకొని రావాలి. ఇది మన బాధ్యత, మనందరి బాధ్యత. ప్రభుత్వం బాధ్యత. విద్యావంతుల బాధ్యత. ఇందుకు మార్గాలను మనమే అన్వేషించాలి. సమాజ అవసరాల వుత్పత్తులు, సేవల శ్రమ భారంలో మునిగి వున్న వారి కోసం ఈ మాత్రం భారమైనా మనం మోయాలి.

ఈ క్రమంలో 'డప్పు' నెట్‌వర్క్ సంఘాలు చేపట్టిన చిరు ప్రయత్నం దళిత హక్కులపై ప్రచార రథయాత్ర అభినందనీయం. 8 రోజుల పాటు 3 బృందాలుగా మండువేసివిలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోను హక్కుల ప్రచారాన్ని గావించిన ఈ బృందాలను వారికి సాదర స్వాగతాలు పలికిఆదరించిన దళిత సంఘాలకు, నాయకులకు, 'సాక్షి' మానవహక్కుల నిఘా తన హృదయపూర్వక అభినందనలను అందజేస్తూంది. ఇది మరిన్ని హక్కుల ప్రచారాలకు స్ఫూర్తినిస్తుందని, ఎందరికో చైతన్యాన్ని కలిగిస్తుందని ఆశిస్తూ, అభిలషిస్తూ ఈ సంచికను ప్రచార రథయాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అంకితమిస్తున్నాం.

ఇట్లు
**సాక్షి**

## దళిత్ కాల్ లైన్

నేటి సమాజంలో కులవ్యవస్థ వేళ్ళు పాతుకొని పోయిన సందర్భంలో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల ప్రజలు అనేక హింసలకు గురౌతున్నారు. కుల అకృత్యాలకు సాక్షులుగా ప్రత్యేకించి దళితులు, గిరిజనులు అందులోనూ స్త్రీలు మిగులుతున్నారు. అలాంటి ఘోరమైన పరిస్థితి హైటెక్ నగరమైన హైదరాబాద్‌లోని హయత్‌నగర్ నుండి ఒంగోలు వెంగముక్కల పాలెం వరకు అనేక ఘటనలు మనముందుకు వస్తున్నాయి. రాష్ట్రమంతటా ఇలాంటి పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సాక్షి మానవహక్కుల నిఘా తన బాధ్యతల్ని తాను నిర్వర్తించుకుంటూ ముందుకు వెళుతుంది. ఆ క్రమంలో ఉన్న సమాచార వ్యవస్థని మరింత విస్తృతం చేసుకోవాల్సిన అవసరం వుంది.

కావున గ్రామాల్లో వివిధ ఉద్యమాల్లో ప్రజోపయోగ కార్యక్రమాల్లో పాల్గొంటున్న సామాజిక కార్యకర్తలు ఆయా గ్రామాల్లో జరిగిన **"రేప్, మర్డర్, సాంఘిక బహిష్కరణ, సామూహిక దాడులు, ఆస్తుల విధ్వంసం, లాకప్‌మరణాలు** మొదలైన వాటి వివరాలను టోల్ ఫ్రీ నెంబర్ - 18004255535, 27737093కు తెలియజేయ వలసిందిగా కోరడమైనది.

ఇట్లు
సాక్షి మానవహక్కుల నిఘా

# దళిత హక్కులపై ప్రచారయాత్ర - అనుభవాలు

62 సం॥ల స్వతంత్ర భారతదేశంలో దళితుల స్థానం ఏంటా? అని ఆలోచిస్తే, ఇప్పటికీ శూన్యంగానే ఉంది. అలనాటి స్వతంత్ర సంగ్రామంలో ఎందరో ప్రాణాలకు తెగించి పోరాడిన వారిలో దళితులే అధిక శాతం. కానీ, పేరు మాత్రం అగ్రకులాల వారికి రావడం విచారకరం. సమాన అవకాశాలు, రిజర్వేషన్లు, జి.ఓలు ఇవన్నీ పేపర్లకు పరిమితమవుతున్నాయి. కార్యాచరణ ప్రణాళికను మొదలు పెట్టే సరికి ఐదు సంవత్సరాల కాలవ్యవధి పూర్తి కావడం, ఈలోపు ఎన్నికల కోసం ఖర్చుపెట్టిన ఆదాయగండిని నింపుకోవడం, మళ్ళీ ఎలక్షన్‌లో తన బలాన్ని నిరూపించుకోవడం, పార్టీని బలోపేతం చేయడం ఇప్పటికీ జరుగుతూనే ఉంది. కానీ, రెక్కాడితేగాని, డొక్కాడని పరిస్థితి దళితులది. ప్రపంచీకరణ ఆధారంగా పోల్చిచూస్తే, హైటెక్ యుగంలో జేబులో పచ్చనోటు లేనిదే బయటకు రాలేని పరిస్థితి. కుటుంబ జీవనం కోసం పాలేర్లుగా, జీతగాళ్ళుగా, పాచీపని చేయడానికి కూడా వెనుకాడని పరిస్థితులలో దళితులు ఉన్నారు. ఇంత కష్టపడినా, వారి పనికి తగిన జీతాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారు. దళితులు ఆత్మగౌరవం కోల్పోతూ, తమ హక్కుల గురించి అవగాహన లేక అన్నింటికీ సర్దుకుపోతూ అన్యాయాలకు, అత్యాచారాలకు, దాడులకు గురవుతున్నారు.

ఇలాంటి పరిస్థితులలోనే దళితులకు తమ హక్కుల గురించి, హక్కుల రక్షణకు గాను రాజ్యాంగంలోను, చట్టాలలోను ఉన్న నిబంధనల గురించి, హక్కుల ఉల్లంఘన జరిగినపుడు ఎటువంటి చర్యలు తీసుకోవాలి, మరియు అంబేద్కరిజం గురించి అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో "డప్పు" నెట్‌వర్క్‌లోని దళిత సంఘాలన్నీ కలసి 'సాక్షి' మానవ హక్కుల నిఘా ఆధ్వర్యంలో "దళిత హక్కుల ప్రచార యాత్ర" నిర్వహించారు.

డా.బి.ఆర్ అంబేద్కర్ గారు ఆశించిన సామాజిక న్యాయం, రాజకీయ అధికారం, నైతిక హక్కులు, దళిత హక్కులు, అందరికి అందుబాటులో విద్య "స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం" అనే ఆయన ఆశయాలను, దళిత బహుజనుల జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఎస్సీ/ఎస్టీ అత్యాచారాల (నిరోధక) చట్టం గూర్చి ఆంధ్రప్రదేశ్‌లోని దళిత బహుజన ప్రజలకు అందరికి తెలియజేయు నిమిత్తము ఈ యాత్ర ఏప్రిల్ 14వ తేదీ నుండి 22వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ మొత్తం జిల్లాల్లో అన్ని సంస్థల కార్యకర్తలు 3 గ్రూపులుగా విడిపోయి 1) తెలంగాణ, 2) కోస్తాల్ ఆంధ్ర 3) రాయలసీమ రూట్‌లుగా డా॥ బి.ఆర్.అంబేద్కర్ గారి విగ్రహం నుండి బయలుదేరినవి.

ఈ యాత్ర వారి వారి జిల్లాలోని మండలాలలోని దళిత బహుజన ప్రజలను కలుస్తూ అంబేద్కర్‌గారి ఆలోచనా విధానంను వారికి వివరిస్తూ అంబేద్కర్ గారి విగ్రహాలకు పూలదండలు వేస్తూ అక్కడున్న ప్రజలతో, ప్రజానాయకులతో, పత్రికా విలేకరులతో, మీడియా ప్రతినిధులతో మేధావి వర్గంతో కలసి కార్యక్రమము గూర్చి తెలియజేస్తు వారి విన్నపములను తీసుకొంటు రథం చాలా విజయవంతంగా ముందుకు వెళ్ళగలిగినది. ఇది దళితుల ఐక్యతను తెలియజేస్తు విజయం సాధించింది.

దళిత హక్కులపై ప్రచారయాత్ర చెయ్యడానికి గలకారణం? స్థబ్ధతగావున్న దళిత ఉద్యమాన్ని ఒకసారి కదిలిద్దాం అనే ఉద్దేశ్యం. హైటెక్ యుగంలో కంప్యూటర్లు కళ్లకు కట్టుకుని, సెల్‌ఫోన్లు చెవులకు పెట్టుకుని అనేక పనులు చేస్తున్న మనం మరొక్కసారి వాస్తవాలకు మరింత దగ్గరగా వెళ్ళాలని!

చాలావరకు అనుకున్న ఆశయం నెరవేరిందనే చెప్పాలి.

ప్రతి జిల్లాలోనూ మీడియాతో ముఖాముఖి జరిపాం.

పర్యటించిన ప్రాంతాల్లో దళితుల స్థితి గతులపై ముఖ్యంగా దళిత స్త్రీల పరిస్థితులపై, వారి జీవన విధానం, మారాల్సిన తీరు, సమాజంలో మన భాగస్వామ్యం, ప్రభుత్వాల పనితీరు, దళిత యువత ముందుకు రావాల్సిన ఆవశ్యకతపై చర్చించాం.

హక్కుల ఉద్యమం, ఆత్మగౌరవ ఉద్యమంగా దళిత ఉద్యమం ముందుకెళ్ళాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించాం.

అనేక కుంపట్లతో కుమ్ములాడుతున్న కుల సంఘాలు భవిష్యత్‌ను నిర్దేశించుకోవాలంటే ఏంచెయ్యాలి? అనే ప్రశ్నలు దళిత యువత నుండి పుట్టుకొచ్చాయి.

పట్టణాల్లో సంస్థలుగా, సంఘాలుగా పని చేస్తున్న మనం కొంత మంది సభ్యులకు శిక్షణలివ్వడం ద్వారా ఫలితంలేదు అని తేలింది.

ప్రజా ఉద్యమాలని చెప్పుకుంటున్న మనం శిక్షణలు పొందిన సభ్యులు పల్లెప్రాంత ప్రజలకు శిక్షణలిచ్చి చైతన్య పర్చాల్సిన అవసరతను గుర్తించాం. అనేక ప్రాంతాల్లోని ప్రజలు అవగాహన సదస్సులు కావాలని అడిగారు.

రెండు దశాబ్దాల కాలపరిమితిని తీసుకుంటే దళితుల జీవన విధానం మెరుగు పడింది. అంటరానితనం నుండి విముక్తులయ్యి రిజర్వేషన్లను అనుభవిస్తూ, ప్రభుత్వ పథకాలను ఆస్వాదిస్తూ బోలెడంత మార్పు వచ్చిందనేది మనందరినానుడి నిజమే! మార్పుజరిగింది. వచ్చిన మార్పు ఆశించిన మార్పా? లేక అవాంఛనీయ మార్పా? అనేదే ప్రశ్న.

**1. ఉద్దేశము**

1) డా.బి.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగములో పొందు పరిచిన హక్కులను పల్లె ప్రజల నుండి పట్టణ ప్రజల వరకు ప్రచారం చేయడం
2) దళిత హక్కులను కాపాడుకొనుటకు ఆంధ్ర రాష్ట్రంలోని 23 జిల్లాల్లో దళితులందరిని చైతన్యవంతులు చేయటానికి

3) అంబేద్కర్ వారసులుగా మన హక్కులను అందరికి ప్రచారం చేయడం

**2. కార్యక్రమము నిర్వహణ**

1) సాక్షి-మానవ హక్కుల నిఘా, 2) దళిత బహుజన శ్రామిక యూనియన్, 3) భవిత, 4) దళిత స్త్రీ శక్తి, 5) చిందు, 6) ప్రత్యేక ప్రతిభావంతుల కలయిక 7) సఫాయి కర్మచారి ఆందోళన్, మరియు దళిత సంఘాలు.

**3) కార్యాచరణ ప్రణాళిక**

డప్పు నెట్‌వర్క్ సంస్థలు మార్చి 2008 చివరి వారాలలో మరియు ఏప్రిల్ మొదటి వారంలో "సాక్షి" ఆఫీసునందు సమావేశం ఏర్పాటు చేసుకొని కార్యాచరణ ప్రణాళిక చేయడం జరిగింది. ఈ ఏర్పాటు మొత్తం కూడా సాక్షి సమన్వయంతో జరిగింది.

**2) కార్యాచరణ**

ఏప్రిల్ 14 2008 నుండి ఏప్రిల్ 22, 2008 వరకు

14 ఏప్రిల్ 2008 అంబేద్కర్ పుట్టిన రోజు సందర్భముగా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి 3 రథాలు బయలుదేరాయి 1) తెలంగాణ 2) రాయలసీమ 3) ఆంధ్ర ప్రాంతాలకు

మండలాల్లోను, జిల్లాల్లోను మన దళిత నాయకులు జరిపించిన మీటింగ్స్ అన్ని వారి నాయకత్వంతో కూడుకున్నవి అని గ్రహించక తప్పదు.

దళితుల రాజ్యాధికారం చాల దగ్గరలోనే ఉంది అనేది మనకు స్పష్టముగా కనబడుతుంది.

ఈ రథయాత్ర వల్ల దళిత బహుజనుల ఐక్యతను అన్ని చోట్ల చూశాము.

ఈ రథయాత్ర ఇంకా జిల్లాలోని అన్ని మండలాలు వెళ్ళే విధంగా ప్లాన్ చేసి ఉంటే బాగుండేది.

దళితుల ప్రాధాన్యతను గుర్తించే సంస్థలుగా కూడ ప్రజలలోకి వెళ్ళడం జరిగింది.

ఈ రథయాత్ర వెళ్ళే ప్రాంతాలలో "జాతర" వాతావరణం కనిపించింది.

దళిత హక్కులు, ఎస్సీ/ఎస్టీ (అత్యచారాల నిరోధకచట్టం) గూర్చి ప్రజలకు గ్రామస్థాయిలో కూడ తెలియజేయాలి.

ఈ యాత్రలో టీమ్ కూడ మంచి నాయకత్వాన్ని నేర్చుకోవడం జరిగింది.

ఈ రథయాత్ర వల్ల చాలా మంది క్రొత్త నాయకులు పరిచయం, కొత్త కొత్త ప్రాంతాలు కలవడం, కొత్తవారి పరిచయాలు చాలా చాలా విషయాలు గూర్చి తెలుసుకోవటం జరిగింది.

**ఉత్సాహపరచిన అంశాలు**

- ✦ ప్రతిచోట డప్పులతో, ఊరేగింపుగా మాకు ఎదురు వచ్చి, ఘనంగా ఆహ్వానాన్నివడం.
- ✦ ఎండ వాతావరణంలో మాకు చల్లని పానీయాలను ఇచ్చి మా ఆరోగ్యాల గురించి మాట్లాడడం
- ✦ ప్రతిచోట మాకు అన్ని విధాలైనటువంటి వసతులు కల్పించి, మమ్మల్ని ఆదరించడం.
- ✦ ఉత్సాహంగా ప్రతిస్పందించడం, మాకు సహకరించడం మొదలైనవి.

**నేర్చుకున్న అంశాలు :**

- ✦ టీమ్‌గా కలసి పని చేసే విధానం
- ✦ కమ్యూనిటీతో ఎలా సంబంధాలు ఏర్పరచుకోవాలి
- ✦ బహిరంగ సభలలో మరియు ప్రెస్‌మీట్‌లో మాట్లాడే విధానం
- ✦ ఒక టీమ్‌గా ఉన్నపుడు ఎలా మెలగాలి అనే అంశం
- ✦ ఒక కార్యక్రమం చేసే క్రమంలో ఎటువంటి కార్యాచరణ ప్రణాళిక చేసుకోవాలి అనే అంశాలు నేర్చుకున్నాము.

పని విధానంలో అందరం కలిసి సమీష్టిగా చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేసుకుని తిరిగి రావడం జరిగింది.

**సాధించిన అంశాలు.**

- ✦ షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల అత్యాచారాల నిరోధక చట్టం 1989 గురించి ప్రచారం చేశాము.
- ✦ భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల గురించి వివరించాము
- ✦ డప్పు నెట్‌వర్క్‌లోని వివిధ దళిత సంఘాల పని విధానాన్ని తెలిపాము
- ✦ అంబేద్కర్ విధానాలను వివరించాము
- ✦ ప్రభుత్వ పథకాల గురించి
- ✦ పౌర, రాజకీయ హక్కుల గురించి
- ✦ మహిళల మరియు బాలల హక్కుల గురించి
- ✦ వికలాంగుల హక్కుల గురించి వివరించాము.
- ✦ ఒక్కొక్క రూటులో దాదాపుగా 15,000 మంది దళితులు తమ హక్కుల పట్ల అవగాహన పొందారు.
- ✦ పాత పార్టీలు పాత పద్దతిలో, కొత్త పార్టీలు కొత్త పథకాలతో దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, భూ ఆక్రమాలు జరుపుతూనే ఉన్నాయి. ఏ ఒక్క పార్టీ కూడా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం పరిపాలన చేయడం లేదని మనంఇప్పుడైనా గ్రహించాలి.
- ✦ మరొక్క విషయం ఏమిటంటే ఉన్న పాఠశాలలను మూసివేయడం నడుస్తున్న పాఠశాలలను ప్రైవేటుపరం చేయడం దళితులను విద్యకు దూరంచేసే పథకాలు దీనిని కూడా మనం గుర్తుంచుకోవాలి.
- ✦ అంబేద్కర్ వారసులైన దళితులంతా ఏకమై దళిత హక్కుల కోసం ఉద్యమించాలని ఇటువంటి దళిత రథయాత్రలు మరెన్నో పుట్టుకు రావాలని కోరుతూ.....

*"దళిత అభివృద్ధి కోసం దళిత బాలలను చదవించాలి*
*చదివిన విద్యావంతులంతా దళిత హక్కులకై పోరాటం చేయాలి"*

**రథయాత్ర నిర్వహణ కమిటి**

# కొనసాగిస్తాం అంబేడ్కర్ ఆశయాలను

...✍ - కారుణ్య, కావలి

దళితుల ఆశాజ్యోతి బహుజనుల స్ఫూర్తి ప్రధాత డా॥ భీమ్‌రావ్ రామ్ జీ అంబేద్కర్‌కి జయంతులు, వర్ధంతులు, జరపడం ఆనంద దాయకమే. ఆయన పేరు మీద అనేక సంఘాలు ఏర్పాటు చేయడం కూడా ఆనందదాయకమే. కొనసాగిస్తాం అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తాం అంబేద్కర్ ఆలోచనా విదానాలను అంటూ నినాదాలు చేయడం హర్షించదగ్గ విషయమే.

ప్రతి దళితుడు, ప్రతి దళిత నాయకుడు తమ గుండెల మీద చెయ్యి పెట్టుకొని నిజం చెప్పండి. చాలా మంది నాయకులకు అంబేద్కర్ సిద్ధాంతం తెలియదు. ఆయన ఆశయాలు ఆలోచనా విదానాలు తెలుసుకోవలసిన అవసరం లేక పోయింది. కనీసం ఆయన జీవిత చరిత్ర కూడా చదవలేదనేది నిజం. ఉద్యోగస్తులకు అంబేద్కర్ కనిపించడంలేదు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజ్యాధికారం కలిగిన కులాలకు దళారులుగా మారి అంబేద్కర్ పేరును వాడుకుంటూ జీవనం చేస్తున్న పెద్ద మనుషులు కొందరు కులం పునాదుల మీద ఒక జాతిని, నీతిని నిర్మించలేరని అంబేద్కర్ చెప్పిన కుల సంఘాలు పెట్టుకున్న పెద్దలు, నిస్సిగ్గుగా ఆయన ఫోటోలు పెట్టుకొంటూ ఆయన వారసులం అని చెప్పుకోవడం ఎంత సబబొ ఆలోచించండి. అందరం ఆత్మ పరిశీలన చేసుకుందాం కనీసం యిప్పుడైనా ఆయన చరిత్రను చదువుదాం ఆయన బాటలో నడుద్దాం అంబేద్కర్ జాతీయ నాయకుడు, మానవతామూర్తి.

ఆయన రిజర్వేషనులు ఏర్పాటు, రాజ్యాంగ రచన దళితుల నాయకుడుగా మాత్రమే పరిమితం చేయడం మంచి పని కాదు. ఆయన సోషలిస్టు సమాజస్థాపన, కుల నిర్మూలనకు, స్త్రీ ఉద్ధరణకు, పేదరిక నిర్మూలనకు, నిరుద్యోగ నిర్మూలనకు, కార్మిక హక్కుల కోసం, ఆర్థిక సంస్కరణలు, దేశ సార్వభౌమత్వం కోసం ఒక ఆధ్యాత్మిక గురువుగా, ఒక రాజకీయ పరిశీలకు నిగా, ఒక శాస్త్రవేత్తగా సమాజం గుర్తించి ఆయన అడుగు జాడల్లో నడిస్తే భారతదేశం భాగ్యదేశంగా ప్రపంచ పటంలో ప్రథమ దేశంగా ఉంటుంది.

ఆయన ఆశయాలను ఆలోచనా విధానాన్ని పరిశీలిస్తే చాలా విషయములపై సూటిగా జవాబు యిచ్చినాడు. దేశాభిమానంతో దేశాభివృద్ధి, ఒకేజాతి, ఒకే బాట వేయాలని ఆశించాడు. మానవ హక్కుల సాధనకు నడుంకట్టాడు. సోషలిస్టు సమాజాన్ని కాంక్షించాడు.

అంబేద్కర్ ఆలోచనలో :- చేతి పని మీద ఆధారపడిన పాతకాలపు పరిశ్రమలను పునరుజ్జీవింప జేయడం, యంత్రాల మీద ఆధారపడి కొత్త పరిశ్రమలను పునరుజ్జీవింపజేయడం, ప్రజల సామర్ధ్యాన్ని, ఉత్పాదక శక్తిని పెంచడానికి సాంకేతిక విద్యను విస్తరింపజేయడం. అవసరమైన రంగాల్లో ప్రభుత్వ యాజమాన్యం, ప్రభుత్వ పర్యవేక్షణ కల్పించడం. భూస్వాముల దోపిడి నుండి కౌలుదారులకి రక్షణ కలిగించే చట్టాలు చేయడానికి పూనుకోవడం, పారిశ్రామిక కార్మికులకి ఏర్పరచే వసతుల లాంటివి వ్యవసాయ కార్మికులకు కూడా కల్పించడం.

"సాగుకి పనికివచ్చే భూమిని జాతీయం చేసి, గ్రామాలలో కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా సాగుచేయించాలి. భూమి మీద కాయ కష్టం చేయగలిగిన వారు మాత్రమే ఈ సొసైటీలలో సభ్యులుగా ఉండాలి".

నిరుద్యోగులలో కొంత శాతాన్ని బంజరు భూములలో సెటిల్ చేసి, వ్యవసాయానికి అవసరమైన వసతులు సమకూర్చాలి. మిగతా వారిని పంట కాలువలు త్రవ్వడం, రోడ్లు, నిర్మాణం మొదలగు పనులలో నియమించాలని కోరాడు.

షోలాపూర్ జిల్లా నిమ్న వర్గాల మహాసభ 1937 డిసెంబరు 30న జరిగింది. ఆ మహాసభలో డా॥ అంబేద్కర్ రాజకీయ పార్టీలు, పెట్టుబడిదారుల చేతుల్లో ఉన్నందున బీదవర్గాలకు న్యాయం జరగదని చెప్పారు. అందువల్ల తమ ఆర్థిక పరిస్థితులను మెరుగు పరుచు కోవడానికై పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా ఐక్య సంఘటన ఏర్పడాలని పిలుపునిచ్చారు.

1938 జనవరిలో డా॥ అంబేద్కర్ నాయకత్వంలో ఒక రైతు కూలి ర్యాలి బొంబాయి నగరంలో జరిగింది. రాష్ట్ర నలుమూలల నుండి పేద రైతులు వ్యవసాయ కార్మికులు ఈ ర్యాలిలో పాల్గొన్నారు. ఈ ర్యాలి డిమాండ్లు వ్యవసాయ కార్మికులకు కనీసవేతనం అమలు పరచడం, శిస్తు బకాయిలకు రేషన్ ఇచ్చినట్లు కౌలుక్కూడ రేషన్ యివ్వాలి. బోటి పద్ధతి రద్దు చేయాలి.

1938 ఫిబ్రవరి 12,13 తేదీలలో మన్మాడ్‌లో రైల్వే కార్మికుల్లోని అస్పృశ్యత మహాసభ జరిగింది. డా॥ అంబేద్కర్ ప్రసంగంలో వారికి పెట్టుబడిదారి విధానం, బ్రాహ్మణిజం అన్న రెండు శత్రువులున్నట్లు చెప్పారు. బ్రాహ్మణిజం అంటే బ్రాహ్మణులు అనుభవించే వసతులు కాదని, సమాజంలో కులాల మధ్య హెచ్చు తగ్గులు పాటించే వారందరూ బ్రాహ్మణిజం పాటించేవారని, బ్రాహ్మణిజం స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వాలకి వ్యతిరేకమని వివరించారు. అస్పృశ్యులని రైల్వేలో పోర్టర్లుగా కూడ నియమించడం లేదని అన్నారు.

1938 సెప్టెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వంవారు ఇండస్ట్రియల్ 1938 సెప్టెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వంవారు ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ బిల్‌ని ప్రవేశపెట్టారు. ఈ బిల్‌లో కార్మికుల సమ్మె చేసే హక్కుని పరిమితం చేసారు. కొన్ని పరిస్థితుల్లో కార్మిక సమ్మెని నేరంగా పరిగణించి, తగిన చర్య తీసుకొనేందుకు వీలు కల్పించబడింది. డా॥ అంబేద్కర్ ఈ బిల్‌ను శాసన సభలో వ్యతిరేకిస్తూ, కార్మిక సమ్మెని ఎట్టి పరిస్థితుల్లోను నేరం క్రింద పరిగణించరాదని వాదించారు. "కార్మిక సమ్మె బ్రీచ్ ఆఫ్ కాంట్రాక్ట్" అన్న సివిల్ నేరమౌతుందేగాని, అది క్రిమినల్ నేరం కాజాలదన్నారు. బ్రీచ్ ఆఫ్ కాంట్రాక్ట్‌ని కూడా వర్తింపజేయరాదన్నారు. ఎందువల్లనంటే కాంట్రాక్టు అనేది సామాన్యుల మధ్య జరిగితే అది కాంట్రాక్ట్ అవుతుంది. ధనవంతుడైన ఫ్యాక్టరీ యాజమాని, పొట్ట చేత పట్టుకొని పనిలోకి వచ్చే కార్మికుడు సామాన్యులుకారు, కాబట్టి వారి మధ్య కాంట్రాక్టు చెల్లనేరదని వాదించారు.

1939 జూలైలో బొంబాయి సమావేశంలో ఆర్.యమ్. హైస్కూలు లో రోహిదాన్ ఎడ్యుకేషన్ కమిటి ఆధ్వర్యంలో చమర్ల సమావేశం జరిగింది. డా॥ అంబేద్కర్ ఈ సమావేశంలో పాల్గొని నిమ్న వర్గాలలోని వివిద కులాలు ఐకమత్యంగా ఉండాలన్నారు. వీరి మధ్య కులాంతర వివాహాలు జరిగేటట్లు ప్రోత్సహించాలన్నారు. యస్.సి.లంతా ఒక జాతిగా మారాలని కాంక్షించాడు.

నిమ్నవర్గాల మహిళా మహాసభలో డా॥ అంబేద్కర్ ఉపన్య సించారు. వారి ఉపన్యాస సారాంశం - మహిళలు సంఘాలేర్ప రచుకొని సాంఘిక దురాచారాలమీద పోరాడాలని, వారి పిల్లలని చదివించాలని, పిల్లలకు శుభ్రత నేర్పించాలని, వారి పురుషులని త్రాగుడులాంటి దురలవాట్లు నుండి తప్పించాలని, బాల్య వివాహాలను రద్దుచేయాలి. వివాహాలు చేసుకున్న వారు ఎక్కువ మంది బిడ్డలను కనకూడదు. తల్లిదండ్రులు తమ బిడ్డలకు తమ కన్న ఉన్నతమైన అవకాశాలు, కల్పించాలి. పెండ్లి చేసుకున్న ప్రతి

అమ్మాయి తన భర్తకి స్నేహితురాలిగా సమానురాలుగా ఉండాలి కాని బానిసగా ఉండరాదు అన్నారు.

**కార్మికుల సమస్యలపై ఆయన ఆలోచనలు:** ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ బొంబాయి రాష్ట్ర కమిటి 1943 మే 3వ తేదీన సమావేశంలో డా॥ అంబేద్కర్ కార్మిక ఉద్యమంలోని చీలికలను నిరసించారు. భారతదేశంలో కార్మిక ప్రభుత్వ మేర్పరచడానికి కార్మిక వర్గం కృషి చేయాలన్నారు. భారతదేశానికి స్వరాజ్యం వచ్చినంత మాత్రాన చాలదు. ఆ స్వరాజ్యం ఎవరి చేతిలో ఉంటుంది అనేది ముఖ్య విషయం అన్నారు.

1945 డిసెంబరు ప్రాంతీయ లెబర్ కమీషనర్ల సమావేశము బొంబాయి సెక్రటేరియట్‌లో జరిగింది. డా॥ అంబేద్కర్ ప్రారంభోప న్యాసంలో పారిశ్రామిక రంగంలో శాంతి నెలకొల్పడానికి మూడు అంశాలు అవసరమన్నారు. మొదటిది, వివాదాలు పరిష్కరించి యంత్రాంగం దాన్ని అప్పటికే నెలకొల్పమన్నారు, ట్రేడ్స్ డిస్ప్యూట్స్ యాక్ట్‌లో సవరణ రెండవ, అంశం కనీస వేతనం మూడవ అంశం. రెండవ, మూడవ అంశాలు త్వరలో అమలులోనికి తేవడానికి ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. సామాజిక న్యాయం పునాది మీదనే పారిశ్రామిక శాంతిని నెలకొల్పమన్నారు.

**డాక్టరు బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలలో :** 1947 మార్చిలో రాజ్యాంగ పరిషత్‌కి సమర్పించడానికి డా॥ అంబేద్కర్ ఒక మహజర్ తయారు చేసారు. "స్టేట్ అండ్ మైనారిటీస్" అన్న శీర్షికతో తయారైన ఈ పత్రంలో రాజ్యాంగం మీద డా॥ అంబేద్కర్ అభిప్రాయాలు పొదుపరిచబడినాయి. ప్రజాస్వామ్య మనుగడకు తోటి మానవుని గౌరవించే మనస్థత్వాన్ని అందరూ అలవరచుకోవడం సమాజంలో కులాలన్న అడ్డుగోడలు పోవడం అవసరం అన్నారు. ఉత్పత్తి సాధనాలు వ్యక్తులు చేతుల్లో ఉంటూ వ్యక్తుల లాభాల కోసం ఉత్పత్తి జరుగుతున్నందున సమాజంలో కీడు జరుగుతుంది. ఈ కీడుకి కారణం యంత్రాలు అని అపోహపడే వారున్నారు. ఉత్పత్తి సాధనాలను ఉమ్మడి యాజమాన్యం క్రిందకి తెచ్చినప్పుడు యంత్రాలవల్ల మేలే జరుగుతుంది.

మౌళిక పరిశ్రమలు, ఇన్సూరెన్స్ ప్రభుత్వం యాజమాన్యంలో ఉండాలి. వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించాలి. సాగు భూమినంతా జాతీయం చేయాలి. ప్రతి గ్రామంలో కలెక్టివ్ ఫారాలని నెలకొల్పాలి. ఇవన్నీ సోషలిస్టు కార్యక్రమాలే.

దేశ విభజన తరువాత పాకిస్థాన్‌లో యస్.సి.లని బలవంతంగా ఇస్లామ్ మతంలోకి మార్చడాన్ని డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఖండించారు. తామందరూ వేరే ఏ మతంలోనికి మారాలన్న విషయాన్ని స్థిమితంగా ఆలోచిస్తామన్నారు.

అదేవిధంగా "స్వతంత్ర్యంగా" ఉంటానన్న హైదరాబాద్ సంస్థానంలో షెడ్యూల్డు కులాల వారిని ముస్లిములుగా మారరాదని భారతదేశానికి వ్యతిరేకంగా నిజామ్ ప్రభుత్వానికి మద్దతునివ్వరాదని సలహా యిచ్చారు.

డా॥ అంబేద్కర్ ఒక్కరే రాజ్యాంగాన్ని రచించారు అని రచనా సంఘంలో మరొక సభ్యుడైన టి.టి.కృష్ణమాచారి గారు చెప్పారు.

**చరిత్ర కారుడుగా, సామాజిక విప్లవమూర్తిగా :**

1947 ఏప్రిల్‌లో డా॥ అంబేద్కర్ వ్రాసిన "అస్పృశ్యులు" అన్న పుస్తకం ప్రచురితమైంది. ఇందులో అస్పృశ్యులు ప్రారంభంలో విచ్ఛిన్నమైన తెగలకు చెందినవారు అని, వారిని ఊర్లలో స్థిరపడి వ్యవసాయం చేసుకొనే తెగలకు చెందినవారు అని వారిలో ఊర్లలోకాపలాదారులుగా నియమించి ఊరు బయటనే ఉంచారు. ఐర్లాండు, వేల్స్ దేశాల్లో గ్రామాల బయట ఉన్న తెగలు గ్రామాల్లోని తెగలతో కలసి పోయారు. మన దేశంలో ఇట్లా జరుగలేదు. ఇందుకు కారణం ఈ ఊరి బయట తెగల వారు బౌద్ధమతాన్ని విడవకుండా ఉండడమే కీ.శ.4వ శతాబ్దానికి పూర్వం బౌద్ధం దేశమంతట వ్యాపించి ఉండింది. ఆ శతాబ్దంలో బ్రాహ్మణ మతం బౌద్ధాన్ని ఓడించింది. అప్పుడు గ్రామాలలోని వారు బ్రాహ్మణమతంలో చేరారు. కాని గ్రామాల బయట ఉండిన వారు బౌద్ధులుగానే కొనసాగారు. అందువల్ల వారిని అస్పృశ్యులుగా చేసారనడం డా॥అంబేద్కర్ వాదం.

దేశానికి మరొక ప్రమాదం జనంలో ఉన్న వ్యక్తి పూజ చేసే భావం కొంచెం మేలు చేసిన వాని మీద భక్తి బావంతో ఉంటారు. ఈ గ్రుడ్డి భక్తిని, వీరపూజని మానుకోవాలి.

హిందు కోడ్ ద్వారా హిందువుల ఆచార వ్యవహారాల్లో మార్పులు తేబోతున్నారు. హిందూకోడ్ బిల్లులోని మొదటిభాగాన్ని పార్లమెంట్‌కు వదిలేసి, రెండవ భాగాన్ని మాత్రం చర్చిస్తామన్నారు. అందుకు 1951 సెప్టెంబరు 27న డా॥ అంబేద్కర్ మంత్రివర్గం నుండి రాజీనామా చేశారు. తాను రాజీనామా చెయ్యడానికి కారణాలని వేంటనే పత్రికలకి తెలిపారు. వీటిలో మొదటిది ప్రధాని నెహ్రూ తనకు ప్లానింగ్ పోర్ట్ ఫోలియో ఇస్తామని మాట నిలుపుకోలేదు. రెండవది షెడ్యూల్డు కులాల అభివృద్ధి విషయంలో తన సలహా పాటించకపోవడం.

**మూడవ కారణం:** భారత ప్రభుత్వ విదేశాంగ విధానం సరిగా లేనందున, గుడ్డిగా సొవియట్ యూనియన్ వైపు మొగ్గు చూపినందున భారతదేశం మిత్రులని కోల్పోయింది.

**నాలుగవ కారణం:** హిందూ కోడ్ బిల్‌ని ఆమోదింపజేసే విషయంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చాలినంత చిత్తశుద్ధి, పట్టుదల చూపలేదు అని బి.ఆర్.అంబేద్కర్ చెప్పారు.

ప్రజల ఆర్థిక, సాంఘిక జీవితంలో విప్లవాత్మకమైన మార్పులు, రక్తపాతం లేకుండా చేసే రూపం పద్ధతి కలిగి ఉండేది ప్రజాస్వామ్యం అన్నారు. అందుకే ప్రజాస్వామ్యం ఉన్నతమైన వ్యవస్థ.

చట్టం ముందు అందరూ సమానులన్న సూత్రాన్ని పాటించాలి. "రాజ్యాంగనీతిని" పాటించాలి. సమాజం నీతి నియమాలకు కట్టుబడి ఉండాలి. ప్రజారంగంలో మనస్సాక్షి ఉండాలి అన్నారు. దళితులు రాజ్యాధికారం వైపు నడవాలన్నాడు.

**ఆయన ఆలోచనలలో విదేశాంగ విధానం:** 1954 ఆగష్టు 26వ తేదీన డా॥ అంబేద్కర్ లోకసభలో విదేశాంగ విధానం మాట్లాడారు. ఐరోపాలో పది రాజ్యాలని కబళించిన రష్యాని, టిబెట్‌ని కబళించిన చైనాని నమ్మరాదన్నారు.

చైనా భారతదేశం మీద దాడిచేసే అవకాశం ఉందని డా॥ అంబేద్కర్ చెప్పిన మాటలు ఎనిమిదేళ్ళ తరువాత (1962లో) నిజమైనాయి.

బంజరు భూములన్ని కేంద్రప్రభుత్వం ఆధీనంలోనికి తెచ్చేందుకు రాజ్యాంగంలో ఒక సవరణ చేయ్యాలని ప్రతిపాదిం చారు. ఆ భూములు ఎస్.సిలకు పంచాలన్నారు. అట్లాగే భూపరిమితి చట్టం తెచ్చి, మిగులు భూమిని కూడ యస్.సి.లకు పంచాలన్నారు. వారు ఆ భూములు సాగు చేసుకోవడానికి పెట్టుబడి కావాలన్నారు.

**బౌద్ధ ధర్మం పట్ల:** 1954 అక్టోబరు 3వ తేదీన ఆల్ ఇండియా రేడియోలో డా॥ అంబేద్కర్ తన వ్యక్తిగత ఫిలాసఫీని వివరించారు. అందులో తన సామాజిక సిద్ధాంతాన్ని స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం అన్న మూడు మాటల్లో చెప్పవచ్చు అన్నారు. ఈ సూత్రాలని తాను ఫ్రెంచ్ విప్లవం నుండి తీసుకోలేదని, బుద్ధుని భోధనల నుండి నేర్చుకున్నాను అని ఆయన అన్నారు.

ఈ దేశ ప్రభుత్వాలు బౌద్ధమత వ్యాప్తికి ఎక్కువ కృషి చేయాలన్నారు. తాను ఆ మతానికి కొంత సేవ చేశారు. రాష్ట్రపతి భవన్ సింహద్వారం పైన బౌద్ధ సూత్రాలు వ్రాయించడం, జాతీయ జండాలో అశోక చక్రాన్ని కలపడం ఆయనవల్లే జరిగాయి.

*(☞ తరువాయి 8వ పేజీలో ..... )*

# అత్యాచార బాధితులకు - అధికారులే కొండంత అండ

...✍ - **ఎస్. దేవకుమార్,** ప్రాజెక్ట్ కో.ఆర్డినేటర్, **సాక్షి** EC-EIDHR

చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎం. రవిచంద్ర ఎస్సీ/ఎస్టీ అత్యాచార బాధితులకు చట్టపరమైన హక్కులు దక్కే దిశగా ఒక మంచి కార్యక్రమం చేపట్టారు. అత్యాచార బాదితులతో ఏప్రిల్ నెలలో ఒక సమావేశం ఏర్పాటు చేసారు. అత్యాచారాలకు గురైన 64 కుటుంబాలవారు ఆ సమావేశానికి హాజరయ్యారు. వీరంతా అగ్రవర్గాల చేతిలో హత్య గావించబడినవారికి సంబంధించిన వారు, మానభంగాలకు గురైనవారు. ఈ విధంగా అత్యాచారాలకు గురైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు యివ్వాలని 1996లోనే ఒక జి.వోను ప్రభుత్వం విడుదల చేసింది. (జి.వో యం.యస్.నెం.3 సాంఘిక సంక్షేమము (హెచ్.1) విభాగము తేది. 16.01.1996) ఈ సమావేశంలో పాల్గొన్న వారితో కలెక్టరు నేరుగా మాట్లాడి అర్హులైన 41 మందికి హాస్టళ్ళలో కమాటీలు, అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్లు లాంటి ఉద్యోగాలు యిచ్చారు. ఉద్యోగ వయస్సుదాటిన వారికి నెలకు వెయ్యిరూపాయలు ఫించను చెల్లించాలని ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమమంతా కలెక్టరు స్వయంగా చేపట్టారు. ముందుగా అత్యాచారాలకు గురైనవారి వివరాలు తెప్పించుకొని ఆయన ఈపని చేసారు. కలెక్టరు చట్టాన్ని అమలు చేయడంలో చూపించిన చొరవ కారణంగానే అనేక బాధితుల బ్రతుకుల్లో వెలుగు వచ్చింది. అత్యాచార బాధితుల హక్కులను రక్షించడానికి అధికారులకు చట్టపరంగా అనేక అధికారాలు కల్పించబడినాయి. రాజ్యాంగపరమైన, చట్టపరమైన కొన్ని హక్కులను, అధికారుల అధికారాలను తెలుసుకుందాం.

**భారత రాజ్యాంగము ఆర్టికల్ 17**

భారత రాజ్యాంగం అధికరణ 17 అంటరానితనాన్ని నిర్మూలిస్తుంది. అంటరానితనాన్ని ప్రోత్సహించినా, పాటించినా, ప్రచారం చేసినా అట్టి వ్యక్తులు చట్టప్రకారం శిక్షార్హులని తెలియజేస్తుంది.

రాజ్యాంగం నిషేదించిన అంటరానితనాన్ని నిర్మూలించడానికి ప్రతి అధికారి తన అధికారాలను వినియోగించుకొనవచ్చు. ఎస్సీ/ఎస్టీ లపై జరిగే అత్యాచారాలన్నింటికి ప్రత్యక్షంగానో పరోక్షంగానో అంటరానితనము, దాని పర్యవసానంగా చోటుచేసుకున్న సామాజిక అభద్రతలే అత్యాచారాలకు కారణాలు. అందువల్ల బాదితులైన వారికి బద్రత కల్పించి వారి హక్కులను పరి రక్షించాల్సిన బాధ్యత అధికారులపైనుంది.

**జీవించే హక్కు-అధికరణ 21**

ప్రతి మనిషికీ జీవించే హక్కు వుందని, చట్టపరమైన విధానాల ద్వారాతప్ప మరేవిధంగాను ఆ హక్కుకు బంగం వాటిల్లకూడదని అధికరణ 21 తెలియజేస్తుంది. జీవించే హక్కు ప్రాథమిక హక్కు. ప్రాథమిక హక్కులు ఒకరు యిచ్చేవి కాని, తీసుకునేవి కాని కాదని పుట్టుకతోనే ప్రతిమనిషికి సంక్రమిస్తాయని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ప్రభుత్వాలు చేయాల్సిందంతా ఆ హక్కులను కాపాడటమేనని స్పష్టంగా తెలియజేసింది. పై తెలిపిన విషయాలను బట్టి పౌరులకు సంబంధించిన ప్రాథమిక హక్కులకు బంగం కలిగినప్పుడు వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపైనుంది.

అత్యాచారం చేయడం, చంపడం, అక్రమంగా నిర్బందించడం, అంటరాని వాళ్ళుగా చూడడం, ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా తిట్టడం లాంటి చర్యలన్నీ జీవించే హక్కును కాలరాయడమే అవుతుంది. ముఖ్యంగా తరతరాలుగా దళితుల జీవించేహక్కుకు ఎప్పుడూ భంగం వాటిల్లుతూనే వుంది. దళితుల ప్రాథమిక హక్కులు అగ్రవర్ణాలచే నిత్యం అపహాస్యం చేయబడుతున్నాయి. అందరితోపాటు సమానంగా జీవించాలంటే సమానమైన హక్కులు వుండాలి. వుంటే సరిపోదు. దానిని పరిరక్షించడానికి తగిన యంత్రాంగము, అధికారాలు కూడా వుండాలి. ఆ విధంగా హక్కులు కోల్పోయిన వ్యక్తికి ప్రభుత్వం బాధ్యత వహించాలి. తగిన నష్టపరిహారం చెల్లించి జీవన స్రవంతిలో భాగస్వాములను చేసే బాధ్యత ప్రభుత్వం చేపట్టాలి.

**షెడ్యూల్డు కులాలు షెడ్యూల్డు తెగలపై (అత్యాచారాల నిరోధక) చట్టము 1989:**

సామాజికంగా అణగారిన వర్గాలైన ఎస్సీలు ఎస్టీలపై అత్యాచారాలు జరిగినపుడు వారిని జీవన స్రవంతిలోకి తీసుకరావడానికి, నష్టానికి తగినట్టి పరిహారాన్ని చెల్లించే వెసులుబాటు కల్పిస్తూ 1989 సం॥లో భారత పార్లమెంటు ఎస్సీ/ఎస్టీలపై (అత్యాచారాల నిరోధక) చట్టం 1989 చేసింది. ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యము అత్యాచారాలు నిరోధించడమే. అంతేకాకుండా అత్యాచార బాధితులకు రక్షణ కల్పించటం, నష్ట పరిహారాన్ని అందజేయడం, తక్షణ సహాయ పునరావాస సౌకర్యాలు కల్పించటం కూడా ఈ చట్టంలో భాగాలే. ఇవన్నీ పొందే హక్కు బాదితులకు వున్నది. ఈ హక్కుల్ని పరిరక్షించే బాధ్యత అధికారులపై వుంది.

ఎస్సీ/ఎస్టీ చట్టం చేయబడిన తరువాత 6 ఏళ్ళకు అంటే 1995 ఎస్సీ/ఎస్టీ అత్యాచారాల నిబంధనలు రూపొందించబడినాయి. ఈ నిబంధనలు అత్యాచారాల నిరోధానికి ఏఏ చర్యలు చేపట్టాలి, అత్యాచార బాధితులకు తక్షణ సహాయం, పునరావాస చర్యలు ఎవరు చేపట్టాలి. నష్టపరిహారంగా ఎంత చెల్లించాలి. ఎపుడు చెల్లించాలి అనేవి స్పష్టంగా తెలియజేయబడినాయి. అంతేకాకుండా బాధితులకు సహాయం చేయడానికి అనేక జి.వోలు కూడా చేయబడ్డాయి. జస్టిస్ పున్నయ్యగారి కమీషన్ కూడా ప్రభుత్వానికి అనేక సిఫార్సులు చేసింది. ఆయన తన రిపోర్టును యిచ్చిన తరువాత కూడా అనేక జి.వోలు చేయబడినాయి. వీటన్నింటిని అమలు చేయాల్సిన బాధ్యత, ప్రభుత్వాధికారులదే!

ఎస్సీ/ఎస్టీ అత్యాచారాల నిబంధనలు 1995 ప్రకారం ఏఏ అధికారికి, ఏఏ అధికారాలు యివ్వడినవో చూద్దాం.

**నిబంధన :**

12. జిల్లా పరిపాలనా యంత్రాంగము తీసికొనవలసిన చర్యలు.

(1) జిల్లా మేజిస్ట్రేటు (జిల్లాకలెక్టరు) మరియు పోలీసు సూపరింటెండెంటు అత్యాచార స్థలమును చూసి జరిగిన ఆస్తి, ప్రాణ నష్టము అంచనా వేయవలెను. నష్టపరిహారమునకు అర్హులయినవారి జాబితా తయారుచేయవలెను.

(2) ప్రథమ సమాచార నివేదిక, సంబంధిత, పోలీసుస్టేషనులో గల పుస్తకములో నమోదు చేయించి నేరస్థులను అదుపులోనికి తీసుకొనుటకు అవసరమయిన చర్యలు పోలీసు సూపరింటిండెంట్ చేపట్టవలెను.

(3) పోలీసు సూపరింటెండెంటు, అత్యాచార స్థలాన్ని సందర్శించిన వెంటనే దర్యాప్తు అధికారిని నియమించవలెను. ఆ ప్రదేశములో తగిన పోలీసు బలగమును ఏర్పాటు చేసి అవసరమైన నివారణ చర్యలు చేపట్టవలెను.

(4) జిల్లా మేజిస్ట్రేటు లేక సబ్-డివిజన్‌లో మేజిస్ట్రేటు లేక ఏ యితర ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు అయినా అత్యాచారమునకు

గురైన వ్యక్తులకు, వారి కుటుంబ సభ్యులకు మరియు వారిపై ఆధారపడినవారికి ధన వస్తురూపాలలో లేదా రెండు విధాలుగా తక్షణ సహాయము అందునట్లు ఏర్పాట్లు చేయవలెను.

(5) ఈ చట్టము క్రింద జరిగిన నేరము కారణంగా సంభవించిన మరణము లేదా గాయము లేదా ఆస్థి నష్టము నిమిత్తము సబ్‌రూలు (4) క్రింద బాధితునికి లేక వారిపై ఆధారపడి జీవించువారికి అందించు సహాయము, ప్రస్తుతము అమలులోవున్న ఏదైనా శాసనము క్రింద ఇవ్వబడు పరిహారమునకు అదనంగా పొందవచ్చును.

(6) సబ్‌రూలు (4)లో వుదహరించిన పరిహారము మరియు పునరావాస సదుపాయాలు, ఈ నియమావళికి అనుబంధంగా వున్న షెడ్యూల్డులో ఇచ్చిన పరిమితి ననుసరించి జిల్లా మేజిస్ట్రేటు లేక సబ్‌డివిజనల్ మేజిస్ట్రేటు లేక కార్యనిర్వాహక మేజిస్ట్రేటుకు (ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు) అందజేయవలెను.

పై నిబంధనలో జిల్లా కలెక్టరు, జిల్లా పోలీసు సూపరింటెండెంటు మరియు ఇతర ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్స్ అంటే మండల తహసీల్దారు బాధితులకు ఎట్టి సహాయము అందజేయవచ్చో తెలియజేయబడింది. పై చెప్పినది తక్షణ సహాయంగా యిచ్చేది. అంతేకాకుండా బాధితులకు రూలు 14(2) ప్రకారము బాధితులకు ఎప్పుడెప్పుడు ఎంత నష్టపరిహారముగా చెల్లించవలెనో అనుబంధములో పేర్కొనబడింది.

ఎస్సీ, ఎస్టీ చట్టంలో తెల్పబడిన నష్టపరిహారమే కాకుండా, ప్రభుత్వ పథకాలు ద్వారా యిచ్చే సదుపాయాలు ఉదా:- ఇండ్లు, పిల్లలకు విద్య, భూమి, మొ॥ పొందుటకు కూడా బాదితులు అర్హులు. మరొక విషయమేమంటే అనుబంధములో చెప్పబడిన నష్ట పరిహారము కనీస నష్ట పరిహారమే తప్ప గరిష్ట నష్టపరిహారం కాదు. ప్రభుత్వం నష్ట పరిహారం క్రింద అనుబంధములో వున్న దానికన్నా ఎక్కువ ఎంతైనా చెల్లించ వచ్చు. కాని తక్కువ మాత్రం యివ్వరాదు.

ముఖ్యంగా 1996లో వచ్చిన జి.వో బాధితులకు ఉద్యోగావ కాశాలు కూడా కల్పించింది. కాని ఆ జి.వో క్రింద ఉద్యోగం పొందిన బాదితులు చాలా తక్కువ. అంతేకాకుండా జస్టిస్ పున్నయ్య కమీషను రిపోర్టును సమర్పించిన తరువాత చట్టం పగడ్బందీగా అమలుకావడానికి తేది.31.10.01 నాడు సాంఘిక సంక్షేమ శాఖ వివిధ అంశాలను దృష్టియందుంచుకొని 22 జి.వో లను విడుదలచేసింది. ఈ జి.వోలలో కొన్నైనా అమలుకు నోచుకోవడంలేదు. అధికారులు చట్టాన్ని సక్రమంగా అమలుచేయని కారణంగా అత్యాచారాలు నానాటికి పెరుగుతున్నాయేకాని తరగడం లేదు. అంతే కాకుండా అత్యాచారానికి గురైన తురువాత కూడా అనేక విధాలుగా బాధితులు వేధింపులు ఎదుర్కొంటున్నారు. వాటిలో ప్రధానమైనవి :

- బాధితుని కుల సర్టిఫికేట్ యిస్తేకాని ఎస్సీ, ఎస్టీ చట్టం క్రింద నమోదు చేయకపోవుట
- ముద్దాయిలను వేంటనే అరెస్టు చేయని కారణంగా వారు మళ్ళీ బాధితులను బెదిరించుట
- బాధితులపై ఎదురు కేసులు పెట్టుట/పెట్టించుట.
- బాదితులకు తక్షణ సహాయము/పునరావాసము అందకపోవుట
- వెంటనే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయకపోవుట
- ఎస్సీ/ఎస్టీ చట్టం క్రింద కేసు నమోదు చేయకపోవుట
- చేసినా తగిన సెక్షను క్రింద నమోదు చేయకపోవుట
- దర్యాప్తు జాప్యము జరుగుట

పైన చెప్పిన కారణాలే కాకుండా ఇంకా అనేక అంశాలు వున్నాయి. కాబట్టి అధికారులు తమ అధికారాలను సక్రమంగా బాధితుల సంక్షేమం కోసం ఉపయోగించి చిత్తూరుజిల్లా కలెక్టర్ ఎం. రవిచంద్ర వలె ఆదర్శప్రాయంగా నిలవాలని కోరుకుందాం! ●

(➻ 6వ పేజీ తరువాయి ..... )

**లక్ష మందితో బౌద్ధ దీక్ష స్వీకరించడం :-** బౌద్ధాన్ని ఎన్నుకొనేందుకు కొన్ని కాణాలు చెప్పారు. బౌద్ధమతం గుడ్డి నమ్మకాల మీద ఆదారపడిలేదు. హేతువాదం మీద ఆదారపడింది. ఇతర ప్రవక్తలు మోక్షానికి మార్గం చూపుతున్నారు. బుద్దుడు నీతివంతమైన జీవితానికి మార్గం చూపుతున్నారు.

సామాజిక అస్తిత్వానికి "మనిషే" ప్రాధమికమైన అంశం మనిషి నుండే మొత్తం సామాజిక కార్యచరణ ప్రారంభమౌతుంది. మనిషికి తనవైన లక్ష్యాలు, విలువలూ వుంటాయి. మానవ జీవితానికి అంతిమ లక్ష్యం ఏమిటో కనిపెట్టడమే తత్వశాస్త్రం యొక్క కర్తవ్యం.

చాతుర్వర్ణ వ్యవస్థ సహజ న్యాయ సూత్రాలకు, అభివృద్దికి స్ఫూర్తికి వ్యతిరేకమైనదని అంబేద్కర్ పేర్కొన్నారు. బహుజనులు సామాజిక, రాజకీయ, ఆర్థిక సాంస్కృతిక హక్కులను కాలరాయడం కోసమే వర్ణ వ్యవస్థను కుట్రపూరితంగా తీసుకు వచ్చారనీ దీనికి ఏ సాధికారితలేదని ఆయన వాదించారు. ఆయన అందించిన **సిద్ధాంతంలోని ముఖ్యాంశాలు**

1)కుల నిర్మూలన 2) స్టేట్ సోషలిజం 3) రాజకీయ ఆర్థిక సమాజిక సమానత్వం 4) బౌద్ధం వీటిని అమలు పరచడానికి పోరాట పంథాగా "బోధించు, సమీకరించు, పోరాడు" యిచ్చినాడు. ఏ విప్లవం రాత్రికి రాత్రే విజయవంతం కాదు. సుదీర్ఘ పోరాట క్రమమని చెప్పాడు. దళితులు నడిస్తే భారత సమాజం ఉన్నతమైన సమాజంగా, ప్రపంచానికి నాయకత్వం వహించే స్థితికి చేరుతుంది.

**సామాజిక పరిష్కారాలు కొన్ని సూచించారు అంబేద్కర్ :**

ఉప కులాలను రద్దు చేయడం ద్వారా మొత్తంగా కుల వ్యవస్థను రద్దు చేయడం, కులాంతర వివాహాలు, సహపంక్తి భోజనాలు, కుల వ్యవస్థ, అంటరానితనం వలన కలిగే దుష్ప్రభావాలు గురించి ప్రజల్లో చైతన్యం కలిగించడం వాటికి వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రజలను సమీకరించడం, దళిత కాలనీలను రద్దు చేసి సవర్ణ హిందువుల నివాస ప్రాంతాల్లో వారికి ఇళ్లను నిర్మించడం, షెడ్యూల్డు కులాల జీవితాలు మెరుగు పడడానికి విద్య ఎంతో అవసరం అని అంబేద్కర్ భావించారు.

అమెరికా నల్లజాతి నాయకుడు ఒకరు టి.వాషింగ్టన్ నుండి ఆయన స్ఫూర్తిని పొందాడు. ఆయన నల్లజాతి వారి అభివృద్ధి కోసం అమెరికాలో విద్యా సంస్థలు స్థాపించాడు. ఆ స్ఫూర్తితోనే షెడ్యూల్డు కులాల వారి అభ్యున్నతి కోసం విద్యాసంస్థలు ఏర్పరిచాడు. సమాజంలో దురాచారాలకు వ్యతిరేకంగా అణగారిన ప్రజలను పోరాడేందుకు సమీకరించడం. పత్రికలు నడపడం ద్వారా ప్రజలను సమీకరించాడు. మహద్, కాలరాం దేవాలయ పోరాటాలు చేసాడు. రౌండు టేబులు సమావేశాలలో పోల్గొన్నాడు.

కుల నిర్మూలన, రాజకీయ, సామాజిక సమానత్వంతో పాటు ఆర్థిక సమానత్వం స్వేచ్ఛ, సౌభ్రాతృత్వాలను విశ్వసించే శక్తులన్నిటిని కలుపుకొని ఆయన వదలినరథాన్ని మనందరం ముందుకు తీసుకుపోదాం.

**కొనసాగిస్తాం అంబేద్కర్ ఆశయాలను**
**కొనసాగిస్తాం అంబేద్కర్ ఆలోచనా విధానాలను**

జై భీమ్. ●

# కేసుల్లో లొసుగులు బాధితులకు మరిన్ని బాధలు

Cr. No / 86/07 ఆత్మకూరు, 302 ఐ.పి.సి, 30.9.07 నెల్లూరు జిల్లా, ఆత్మకూరు గ్రామములో నూకల రవి (36) ఎస్సీ. (మాల) కులమునకు చెందిన వ్యక్తి, భార్య ధనమ్మ కుమార్తెలు కుసుమ (10), నళిని (9), లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తూ, జీవనం సాగిస్తున్నాడు. రవి భార్య ధనమ్మ ప్రక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యహ్న భోజన పథకంలో వంటపని చేస్తుంది. తన కుమార్తెలను ఉన్నత చదువులు చదివించాలని నవోదయ ప్రవేశ పరీక్ష కొరకు శిక్షణ కూడా ఇప్పిస్తున్నాడు. ఇలా ప్రశాంతంగా సాగుతున్న వారి జీవితాలలో ఒక్కసారిగా చీకటి అలముకుంది. యధావిధిగా 29.9.07 శనివారం రాత్రి తన విధినిర్వహణకు వెళ్లిన నూకల రవి 30.9.07 ఉదయం ఇంటికి తిరిగి రాలేదు.

వివరాలలోకి వెళితే ది.29.09.07 రాత్రి నూకల రవి కళాశాల పహారా కాస్తుండగా ప్రక్కనే ఉన్న పాఠశాల భవనంలో అలికిడి వినిపించి, అటుగా టార్చిలైటు వేసి దృష్టి సాదించిన రవికి పాఠశాల భవనం పై నుండి దుంగలను తీస్తున్న ఇద్దరు వ్యక్తులు కలిపించారు. దగ్గరకు వెళ్ళి వారిని నిలువరించిన రవిపై ఆ దుండగులు దాడి చేసి, ఇనుప రాడ్‌తో తలమీద గాయపర్చడంతో అక్కడిక్కడే రవి కుప్పకూలి మరణించాడు.

నిందితులైన కుక్కల, యానాదాయ్య (55), కృష్ణయ్య (45) ముత్తరాసి కులము, ఆత్మకూరు గ్రామమునకు చెందినవారు. తామే ఈ హత్య చేశామని పోలీసులు మరియు పత్రికా విలేకరుల సమక్షముతో అంగీకరించారు. నిందితుల వాంగ్మూలంలో వారు దుంగలను దొంగిలించడానికి వచ్చారని, అడ్డగించిన రవిపై దాడి చేశామనీ, అందుకే అతను మరణించాడని తెలిపారు.

ఆ కళాశాల ప్రిన్సిపాల్ కౌశల్యమ్మ వాగ్మూలంలో పాఠశాలలో ఇలాంటి అరాచకాలు ఎప్పుడూ కొనసాగుతూనే ఉన్నాయనీ,ఆ విషయాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా, వారు ఖాతరు చేయలేదనీ, గతంలో ఉన్న వాచ్‌మన్‌కు కూడా బెదిరింపులు వచ్చాయనీ, అందుకే అతను బదిలీ చేయించుకుని వెళ్ళినట్లు తెలిపారు. తరువాత మృతుడు నిజాయితీ పరుడు, ఎస్సీ కులమునకు చెందిన వ్యక్తి అని అందునా అదే గ్రామానికి చెందిన వ్యక్తి కావడంతో అతనిని వాచ్‌మన్‌గా ఉద్యోగంలోకి తీసుకున్నామని, రవి ఉద్యోగ బాధ్యతలు తీసుకున్న తరువాత అరాచకాలు తగ్గాయనీ, కళాశాలను చాలా జాగ్రత్తగా పరిశుభ్రంగా ఉంచుతున్నాడని తెలిపారు. అయితే సి.ఐ. సీతారామయ్య తన వాంగ్మూలంలో దుంగల కోసం వెళ్ళిన నిందితులు తాగిన మైకంలో కాకతాళీయంగా దాడి చేశారని మృతుడు రక్తపు మడుగులో పడి యుండగా తమ ఇళ్ళకు వెళ్లిన నిందితులు మరలా వచ్చి అతను బ్రతికి ఉన్నాడా? లేదా అని పరిశీలించి, అతనికి శ్వాస ఉందని తెలిసి పరారయ్యారని, పందులు మృతుని మెదడు, ముఖ భాగంలోని మాంసాన్ని తిన్నాయని అందువలననే రవి మృతదేహం వికృతంగా తయారయ్యిందని తెలిపారు.

ఇదిలా ఉండగా మృతుని భార్య తన కంప్లైంట్‌లో తన భర్త ముఖం కుడివైపు సగభాగం నరక బడి, తలవెనుక బలమైన రక్తగాయముతో పడి ఉన్నాడని తెలిపింది.

**గమనించవలసిన అంశాలు :-**

- ఈ కేసు సెక్షను 302 ఐ.పి.సి ప్రకారం నమోదయ్యింది.
- మృతుడు ఎస్సీ కులమునకు చెందిన వ్యక్తి
- నూకల రవి గత మూడు నెలలుగా కళాశాల నైట్ వాచ్‌మన్‌గా పని చేస్తున్న విషయం గ్రామస్తులందరికీ విధితమే.
- మృతుడు మరియు నిందితులు ఒకే గ్రామానికి చెందిన వ్యక్తులు, ఒకరి కులము ఒకరికి తెలుసు. మరియు పరిచయం ఉన్న వ్యక్తులు.
- కొన ఊపిరితో ఉన్న మృతుని ఆసుపత్రికి తీసుకు వెళ్ళకుండా, అతని మృతికి కారణమయిన నిందితులపై ఎస్సీ/ఎస్టీ చట్టం ప్రకారం కేసు నమోదుచేయాలన్న దళిత నాయకుల డిమాండ్‌ను ఎస్పీ హరికృష్ణ ఖండించడం నిజంగా అధికార నిర్లక్ష్యమే అవుతుంది. అంతే కాకుండా నిందితులు బెయిలు మీద బయటకు వచ్చి, యధేచ్ఛగా వారి కార్యకలాపాలు చేసుకుంటుంటే, మృతుని భార్యా, పిల్లలు దిక్కుతోచని పరిస్థిలలో ఉన్నారు. మృతుని ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి రూ.60,000 చొప్పున ప్రభుత్వం డిపాజిట్ చేసింది.

**సిఫారసులు :**

మృతుని కుటుంబానికి వెంటనే తక్షణ సహాయం మరియు నష్టపరిహారం చెల్లించాలి.

- మృతుని భార్యకు జీవనోపాధిని కల్పించాలి.
- మృతుని పిల్లలకు విద్య, ఉపాధి జీవన భద్రత ప్రభుత్వం. కల్పించాలి.
- వారి సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.
- ఎస్సీ/ఎస్టీ చట్టంలోని సెక్షను 3(2)(V) ప్రకారం అరెస్టుచేసి కేసు రిజిస్టర్ చేయాలి మరియు నిందితులను అరెస్టుచేసి శిక్షించాలి.
- చట్ట ప్రకారం వచ్చే అన్ని పునరావాస చర్యలు చేపట్టాలి.
- అధికారులు సానుకూలంగా స్పందించి, నిందితులను శిక్షించి, బాధితులకు న్యాయం చేయాలని, సహాయ సహకారాలు అందిస్తారని ఆశిద్దాం. ●

# మహిళలు తెలుసుకోవలసిన కొన్ని చట్టాలు

-ప్రసన్న

"ఒకదేశం అభివృద్ధి సాధించాలంటే పురుషునితో పాటు స్త్రీకికూడా స్వేచ్ఛా, సమానత్వాలు ఉండాలి" డా॥ బి.ఆర్. అంబేద్కర్ అధునిక సమాజంలో స్త్రీలు పురోగతికై ఎంతో కృషి చేస్తున్నారు. విద్య, ఉద్యోగం వ్యక్తిత్వం కలిగి, సమాజంలో గౌరవంగా బతకాలని ఆశిస్తున్నారు. పురుషులతో సమానంగా అన్నిరంగాలలో ముందుకు అడుగులేస్తున్నారు. ఇది ఎంతో గర్వించదిగిన అంశం. అయితే ఈ క్రమంలో వారి హక్కుల, గురించి ఆలోచించడం కానీ, వారికున్న హక్కులు తెలిసుకోవాలని కానీ ఆలోచించడం లేదు. కుంటుంబంలోను, సమాజంలోని యాంత్రిక జీవితాన్ని కొనసాగిస్తున్నారు. వృత్తిపరంగా ఎదుగుదల ఉన్నా వ్యక్తిగతంగా వారి గురించి వారు ఆలోచించలేని స్థితి, లేదంటే తమ ఖర్మగా భావించి, సమర్ధించుకునే వారు కూడా లేకపోలేరు. సగటు స్త్రీల పరిస్థితులు ఇలా ఉంటే, గ్రామీణ మహిళలు అసలు ప్రపంచం ఎటుపోతుందో తెలియని స్థితిలో ఉన్నారు. వారిలో దళిత స్త్రీల పరిస్థితి మరీ దారుణం ఎక్కడ పని దొరికితే అక్కడేవారి ప్రపంచం దళిత స్త్రీలు దళిత పురుషుల దాడులకు, దళితేతర మహిళల ద్వారా మరియు దళితేతర పురుషుల ద్వారా ఇంటా బయట అత్యాచారాలకు, దాడులకు గురవుతున్నారు. వారి జీవితాలు ఆర్థికంగా, సామాజికంగా, సాంఘీకంగా, రాజకీయంగా ఇతరులపై ఆధారపడడం వలన దళిత స్త్రీలు రెండు రెట్లుగా అత్యాచారాలకు గురవుతున్నారు. ఆ విద్య, చైతన్యం లేకపోవడం మరియు అవగాహన లోపం వలన కూడా దాడులకు కారణమవుతున్నాయి. అలాంటి స్థితిలో వారు ఇంక హక్కుల గురించి ఏమి ఆలోచిస్తారు? అయితే ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే పురాణాలు, మనుధర్మ శాస్త్రం పునరావృతమవుతాయి. అపుడు స్త్రీని మరలా ఒక వ్యక్తిగా గుర్తించడం అనేది ప్రశ్నార్ధకమే అవుతుంది.

అయితే ప్రస్తుత పరిస్థితులలో చట్టాలు ఎన్నో స్త్రీల హక్కుల గురించి వారిపై జరిగే అత్యాచారాలు వాటికి శిక్షలు మరియు నష్టపరిహారాల గురించి వివరిస్తున్నాయి. వాటి గురించి తెలుసు కోవలసిన ఆవశ్యకత, అవసరం మహిళలకు ఎంతైనా ఉంది.

**వాటిలో ముఖ్యమైనవి కొన్ని... నేరాలు, మరియు శిక్షలు**

స్త్రీలపై జరిగే నేరాలను రెండు విధాలుగా విభజించవచ్చు.

1. కుటుంబంలో స్త్రీలపై జరిగే నేరాలు
2. సమాజంలో స్త్రీలపై జరిగే నేరాలు

**కుటుంబ పరిధిలో జరుగుతున్న నేరములు**

**(1) వివాహిత స్త్రీని హింసించుట :-**

ఒక వివాహిత స్త్రీని ఆమె భర్తగానీ, లేక భర్త తాలూకు బంధువులు గానీ కౄరముగా హింసించినట్లైతే ఐ.పి.సి.498 ఎ ప్రకారం ఆ నేరస్తులకు 3సం॥లు జైలు శిక్ష మరియు జరిమానా విధించడడును.

ఉదా :- ప్రాణాపాయము, శరీరగాయములు లేదామానసిక వత్తిడులు అనారోగ్యానికి గురిచేయుట.

**(2) ఆత్మ హత్య చేసుకొనుటకు ప్రోత్సహించుట :-**

ఒక వ్యక్తి మరొక వ్యక్తిని ఆత్మహత్యకు ప్రేరేపించి నందు వలన ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లయితే, ప్రేరేపించిన వ్యక్తికి సెక్షను 306 ఐ.పి.సి. ప్రకారం పది సం॥లు జైలు శిక్ష మరియు జరిమానా విధించబడును.

**(3) వరకట్నపు చావులు :-**

వివాహము జరిగిన ఏడు సం॥ల లోపల వివాహిత స్త్రీ కాలిన గాయములు ఫలితంగా గానీ, లేక ఇతర శారీరక గాయముల వలనగాని మరణించి ఆ గాయములు అస్వభావికమై ఉండి. ఆ విధమైన మరణమునకు ముందు వరకట్నము తీసుకురావలసిందిగా ఆమె తన భర్త చేత గాని, అతని బంధువుల చేతగాని హింసింబడినట్లైతే అటువంటి మరణము "వరకట్న సంబంధిత" మరణముగ పరిగణింపబడుతుంది. ఆమె భర్త లేక అతని బంధువులే ఆమె మరణమునకు కారణముగా భావింప బడుతుంది.

304 ఐ.పి.సి. సెక్షన్ ప్రకారం ఎవరి వలనైతే వరకట్న మరణము సంభివిస్తుందోవారికి కనీసము ఏడు సంవత్సరములకు తగ్గకుండా జైలు శిక్ష మరియు జరిమానా విధింపబడుతుంది.

**(4) వివాహానికి సంబంధించిన నేరములు :-**

**ఎ) జీవిత భాగస్వామి బ్రతికి ఉండగా మరొక వివాహము :-**

వివాహము జరిగిన స్త్రీ, పురుషులతో ఎవరైనా తన జీవితభాగస్వామి బ్రతికి ఉండి, వారిద్దరి మధ్య గల వివాహబంధము కొనసాగుతున్న తరుణములో మరొకరిని పునర్వివాహాము చేసుకున్నట్లయితే వారికి సెక్షను 494 ఐ.పి.సి. ప్రకారం ఏడు సం॥లు జైలు శిక్ష మరియు జరిమానా విధించబడును.

**బి) పూర్వ వివాహమును రహస్యముగా ఉంచుట :-**

సెక్షన్ 494 ఐ.పి.సి వివరించిన విధముగా ఒక వ్యక్తి రెండవ వివాహాము చేసుకొను సందర్భములో, తనకు మొదటి వివాహాము జరిగి విషయము నూతనముగా వివాహము చేసుకోబోయే వ్యక్తితో చెప్పకుండా రహస్యంగా ఉంచినట్లయితే ఆ వ్యక్తికి సెక్షన్ 494 ఐ.పి.సి ప్రకారం 10 సం॥లు జైలు శిక్ష మరియు జరిమానా విధించబడును.

**సి) మోసపూరిత వివాహము చేసుకొనుట :-**

వివాహాము చట్టప్రకారం చెల్లదని, అందువలన ఆ వివాహామునకు చట్ట బద్ధత ఏర్పడదని తెలిసి ఉండి కూడా దుర్భద్ధితోను, దురాలోచనతోను ఒక వ్యక్తి వివాహము చెల్లుతుందని మోసగించి స్త్రీని వివాహము చేసుకున్నట్టయితే ఆ వ్యక్తికి 7సం॥లు వరకు జైలుశిక్ష జరిమానా విధించబడుతుంది.

**డి) మరొకని భార్యతో వివాహేతర సంబంధము కలిగియుండుట :-**

ఒక స్త్రీకి వివాహామై ఉన్నదని, ఆమె మరొకని భార్య అని తెలిసికూడా, ఆమె భర్తకు తెలియకుండా, అతని అనుమతి లేకుండా ఒక వ్యక్తి ఆ స్త్రీతో సంబంధము కలిగి ఉన్నట్లయితే అది వ్యభిచారమవుతుంది.

అందుకు గాను సెక్షన్ 497 ఐ.పి.సి. ప్రకారం ఆ వ్యక్తికి 5 సం॥లు శిక్ష మరియు జరిమానా మరియు రెండూ విధించవచ్చు.

**2. సమాజంలో స్త్రీలపై జరుగుతున్న అత్యాచారములు :-**

**1) మానభంగమునకు నిర్వచనము సెక్షన్ 375 ఐ.పి.సి.**

ఈ క్రింది సందర్భములలో ఒక పురుషుడు, ఒక స్త్రీపై అత్యాచారము చేయడాన్ని మానభంగంగా పరిగణింపబడుతుంది.

- ఆమె ఇష్టమునకు వ్యతిరేకముగా
- ఆమె అనుమతి లేకుండా
- ఆమెను చంపుతామనిగాని లేక గాయపరుస్తామని గాని బెదిరించినందువలన భయపడి ఆమె అంగీకరించనపుడు
- ఒక స్త్రీకి తాను భర్తను కానని ఒక పురుషునికి తెలిసినప్పటికీ, ఆస్త్రీ మాత్రమే అతనితో చట్టబద్ధముగా వివాహం జరిగిందని నమ్మి ఇచ్చిన అనుమతితో మాన భంగము చేసినా,
- ఒక స్త్రీ మత్తుమందు సేవించి యున్నపుడు తన అంగీకారాన్ని తెలిపినా, మతిస్థిమితం లేనివారు, అంగీకారము తెలుపుటకు శక్తి లేనివారు (అనర్హులు)మొ॥లైన వారిపై అత్యాచారము చేసినా
- 16 సం॥లలోపు వయస్సు గల బాలిక పై ఆమె అనుమతి ఉన్నా లేకున్నా మానభంగము చేసినా

**2) సెక్షన్ 375 ఐ.పి.సి మాన భంగమునకు శిక్ష :-**

సెక్షను 375 ఐ.పి.సి.లో వివరించిన విధముగా ఎవరైనా ఒక స్త్రీని మానభంగము చేసినట్లయితే ఈ క్రింద వివరించిన విధముగా శిక్ష విధించబడుతుంది. 376 ఐ.పి.సి. ప్రకారం, 376 (2) ఐ.పి.సి వివరించిన సందర్భములు కాకుండా మిగిలిన సందర్భములలో మానభంగము నేరమునకు 7 సం॥లకు తక్కువ కాకుండా యావజ్జీవ కారాగార శిక్ష గానీ, లేక పది సం॥లు శిక్ష మరియు జరిమాన విధింప బడుతుంది. అయితే భర్త, తనభార్యనే మానభంగము చేసిన సందర్భములలో భార్య వయస్సు 12 సం॥లు మించనట్లయితే రెండు సం॥ల జైలు శిక్ష మరియు జరిమానా విధించబడతాయి.

376(2) ఐ.పి.సి ప్రకారం ఈ క్రింది సందర్భములలో మానభంగం నేరమునకు పాల్పడిన నేరస్తులకు 10 సం॥లకు తగ్గకుండా కఠిన కారాగార శిక్ష విధించచ్చు. సందర్భమును బట్టి యావజ్జీవ ఖైదు కూడా విధించవచ్చు. అయితే కొన్ని సందర్భములలో 10 సం॥ల కన్న తక్కువ శిక్ష కూడా విధించవచ్చు.

**(ఎ) ఒక పోలీసు అధికారి**

(1) తనకు చెందిన పోలీస్‌స్టేషను పరిధిలో ఎవరినైనా మానభంగము చేసిన ఎడల.

(2) తనకు చెందిన పోలీస్ స్టేషన్ యొక్క ప్రాంగణము లోపల మానభంగము చేసిన ఎడల.

(3) తన యొక్క లేక తన క్రింద పోలీసు అధికారి యొక్క కస్టడీలో ఉన్న స్త్రీపై అత్యాచారం చేసిన ఎడల.

బి) ఒక ప్రభుత్వోద్యోగి, తనకున్న అధికారమును అవకాశంగా తీసుకుని తన కస్టడీలో ఉన్న, లేక తనక్రింద అధికారి ఆధీనముతో నున్న స్త్రీని మానభంగము చేయు సందర్భములలో...

సి) జైలులో ఉన్న మహిళా ఖైదీలపై మరియు పిల్లలు అధికారము కలిగి ఉండి, తనకున్న అధికారములను అవకాశముగా తీసుకుని వారిపై అత్యాచారము చేసిన ఎడల.

> *"స్త్రీల విషయంలో కామన్ కోడ్ కావాలి. అందులో ప్రధానంగా స్త్రీల ఆస్థిహక్కు, విడాకుల హక్కు, వివాహ వయస్సు, స్త్రీ రక్షణ మొదలగు అంశాలుండాలి. స్త్రీల పరిరక్షణ విషయంలో శాస్త్రీయ దృక్పథం రావాలి" (హిందూకోడ్ బిల్లుపై ప్రసంగిస్తూ)*
>
> ***డా॥ బి.ఆర్. అంబేద్కర్***

డి) ఒక ఆసుపత్రిపైనా, అందులోని ఉద్యోగులపైనా అజమాయిషీ చేయు అధికారము కలిగి ఉండి, తన అధికారములను అవకాశముగా తీసుకొని ఆసుపత్రిలో ఉండు మహిళలపై అత్యాచారము చేయుట.

ఇ) గర్భవతిగా నున్న మహిళపై అత్యాచారము చేయుట.

ఎఫ్) 12 సం॥లలోపు వయసు గల బాలికపై అత్యాచారము చేసినా.

జి) ఒక స్త్రీపై సామూహికంగా అత్యాచారము చేసినా ఈ సెక్షన్ ప్రకారం శిక్షింపబడుదురు.

**(3) విడిగా ఉన్న భార్యపై భర్త అత్యాచారం :**

సెక్షన్ 376 (ఎ) ఐ.పి.సి. ఒక వ్యక్తి యొక్క భార్య న్యాయస్థానము యొక్క ఉత్తర్వులు మేరకుగానీ, లేక సాంప్రదాయము వలన గానీ, అతని నుండి విడిగా ఉంటూ ఉన్న సందర్భములలో ఆమె అనుమతి లేకుండా ఆమెపై అత్యాచారము చేసిన ఎడల రెండు సం॥ల జైలు శిక్ష మరియు జరిమానా విధించబడుతుంది.

**(4) స్త్రీపై ప్రభుత్వోద్యోగి అత్యాచారము చేయుట**

**సెక్షన్ 376 (బి) ఐ.పి.సి**

ఒక ప్రభుత్వోగి తన ఆధీనములో పని చేయు మహిళా ఉద్యోగులపై తన అధికారమును అవకాశముగా తీసుకొని ఆమెపై అత్యాచారము చేసిన ఎడల అతనికి 5 సం॥లు జైలు శిక్ష మరియు జరిమానా విధించబడును.

**(5) మహిళా ఖైదీని ప్రలోభపెట్టి జైలు అధికారి తన అధికారమును అవకాశముగా ఉపయోగించి ఆమెపై అత్యాచారం చేసిన యెడల అతనికి సెక్షన్ 376 (సి) ఐ.పి.సి. ప్రకారం 5 సం॥లు మరియు జరిమానా విధించబడును.**

**(6) మహిళా ఉద్యోగులను ప్రలోభపెట్టి వారిపై వైద్యశాల అధికారులు అత్యాచారం చేసిన యెడల వారికి సెక్షన్ 376 (డి) ఐ.పి.సి ప్రకారం 5 సం॥లు శిక్ష మరియు జరిమానా విధించబడును.**

**(7) స్త్రీల ఆత్మాభిమానాన్ని అగౌరవ పరచు నేరములు :**

ఎ. **సెక్షన్ 354 ఐ.పి.సి** : స్త్రీలను కించపరచే విధంగా చిత్రాలు తీయుట, బొమ్మలు గీయడం, రాతలు వ్రాయడం, వ్యాపార ప్రకటనలు ఇవ్వడం, మొ॥ నేరములు చేసినవారికి 2 సం॥లు శిక్ష మరియు జరిమానా విధించబడును.

బి. **సెక్షన్ 354 ఐ.పి.సి** : స్త్రీనికించపర్చే వార్తలు, రాతలు, పాటలు, ప్రదర్శనలు జరిపితే వారికి 2 సం॥లు శిక్షమరియు జరిమానా.

సి. **సెక్షన్ 292 ఐ.పి.సి** : బూతు పుస్తకాలు అమ్మడం ద్వారా స్త్రీలను కించపర్చుట అట్టి నేరస్తులకు 2 సం॥లు శిక్ష మరియు జరిమానా.

డి. **సెక్షన్ 293 ఐ.పి.సి** : యువతులను వేశ్యావృత్తి కొరకు ఇతరులకు అమ్ముట నేరము ఆనేరస్థులకు 2 సం॥లు శిక్ష మరియు జరిమానా.

**(7) అపహరణ** : ఎవరైనా ఒక వ్యక్తిని అతని యొక్క అనుమతి లేకుండా గానీ, లేక అతని తరపున అనుమతి ఇచ్చు. వ్యక్తి యొక్క అనుమతి లేకుండానే తీసుకు వెళ్ళిన యెడల దానిని సెక్షన్ 359 ఐ.పి.సి ప్రకారం అపహరణగా పరిగణిస్తారు.

**(ఎ) సంరక్షకుల ఆధీనము నుండి అపహరణ** : సెక్షన్ 361 ఐ.పి.సి :- యువకుని గానీ, లేక 18 సం॥లు నిండనియువతినిగాని మతిస్థిమితం లేని వారిని గానీ, వారి సంరక్షకుల నుండి తీసుకువెళ్ళిన యెడల అపహరణగా పరిగణింపబడుతుంది.

**(బి) బలవంతపు అపహరణ** : సెక్షన్ 362 ఐ.పి.సి :- ఒక వ్యక్తిని బలవంతము చేసిగానీ, లేక వంచనతో కూడినమోసపుమార్గముల ద్వారగానీ ఒక్క వ్యక్తి ఒక ప్రదేశము నుండి వెళ్ళిపోయేలా చేస్తే అది బలవంతపు అపహరణగా పరిగణింపబడుతుంది.

**(సి) అపహరణకు పాల్పడినందుకు శిక్ష-సెక్షన్ 363 ఐ.పి.సి**

ఎవరైనా ఒక వ్యక్తిని భారత దేశము నుండి గానీ లేక అతని న్యాయబద్ధ సంరక్షకుని నుండి గాని అపహరించినట్లయితే 7 సం॥లు శిక్ష మరియు జరిమానా విధించబడును.

**(డి) భిక్షాటన చేయించుటకై పిల్లలను అపహరించుట - సెక్షన్ 363 ఎ ఐ.పి.సి :-**

భిక్షాటన చేసేందుకు మైనర్ పిల్లలను అపహరించినచో నేరస్థులకు 10సం॥ల వరకు శిక్ష మరియు జరిమానా విధించబడును, మైనరు పిల్లలకు అంగవైకల్యము. కలిగించి భిక్షాటనచేయించిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష మరియు జరిమానా.

**(ఇ) హత్యచేయుటకై అపహరణ** :- ఒక వ్యక్తిని హత్య చేయాలనే సంకల్పములో అపహరించిన వారికి, ఒక వ్యక్తిని అపహరించి, విడుదల చేయాలంటే ధనము ఇవ్వాలనీ, తమ కోర్కెలు తీర్చాలని లేదంటే తాను అపహరించిన వ్యక్తిని చంపేస్తామని బెదిరించిన వారికి మరణశిక్ష లేక యావజ్జీవశిక్ష మరియు జరిమానా విధించబడుతుంది

**-సెక్షన్ 364 ఎ ఐ.పి.సి** :- బలవంతపు వివాహం నిమిత్తం స్త్రీని అపహరణ - సెక్షన్ 366 ఐ.పి.సి ఒక స్త్రీని తనకు ఇష్టము లేని వివాహామునకు లేదా ఇష్టములేని వ్యక్తిని వివాహము చేసుకునేందుకై బలవంతంగా లేదా ఇష్టములేని వ్యక్తిని వివాహము చేసుకునేందుకై బలవంతంగా అంగీకరింప చేయాలనే సంకల్పముతో అపహరించిన యెడల అట్టి వారికి యావజీవ శిక్ష మరియు జరిమానా విధించబడును.

**(8) వ్యభిచారిణిగా మార్చేందుకు మైనర్ యువతిని ప్రోత్సహించుట:-** సెక్షన్ 366-ఎ ప్రకారం ఎవరైనా ఒక వ్యక్తి ఏదో విధముగా 18 సం॥ల లోపు మైనర్ యువతిని ప్రలోభ పెట్టడం ద్వారా ఆమె తాను ఉన్న ప్రదేశమును విడచివెళ్ళి బలవంతముగా ఇతరులతో వ్యభిచారము చేయక తప్పని సరియగు పరిస్థితి కల్పించినట్లైతే. ఆ వ్యక్తిని పది సం॥ల వరకు జైలు శిక్ష మరియు జరిమానా విధించబడుతుంది.

ఒక వ్యక్తి వ్యభిచారము చేయించే నిమిత్తం లేక ఇతర చట్ట వ్యతిరేక చర్యలు, నీతిబాహ్యచర్యలు చేయించే సంకల్పంతో గాని లేక అటువంటి అవకాశము ఉంటుందని తెలిసిగాని 18 సం॥ల లోపు మైనర్లను అమ్మినా, బాడుగకు ఇచ్చినా ఆ వ్యక్తి 10 సం॥ల వరకు జైలు శిక్ష మరియు జరిమానా విధించబడును.

**(10) సెక్షన్ 506 ఐ.పి.సి** : భయపెట్టుట ద్వారా మరణము సంభవించడం, తీవ్రమైన గాయాలు, ఆస్థిని తగులబెట్టుట లేక ధ్వంసం చేయుట, మరణశిక్ష లేక యావజ్జీవ కారాగార శిక్షగానీ, లేక 7సం॥లు అంతకన్నా ఎక్కువ శిక్షింపతగు నేరములను చేసే విధంగా బెదిరించినా, లేక స్త్రీ యొక్క నడవడి మంచిదికాదని ప్రచారము చేస్తామని బెదిరించినా. ఆ నేరస్తునికి 7 సం॥లు శిక్ష మరియు జరిమానా లేక రెండూ.

**(11) సెక్షన్ 509 ఐ.పి.సి** : యావజ్జీవ కారాగార శిక్ష విధింపదగిన నేరము, మరియు జైలు శిక్ష విధింపదగిన నేరములను ప్రయత్నించినచో, ఆ నేరమునకు చట్టములో నిర్ధేశించిన శిక్షతో సగము మరియు మొత్తము జరిమానా విధించవచ్చు.

భారతీయ శిక్షస్మృతిలో 10 సం॥లు అంతకంటే ఎక్కువ శిక్షార్హమైన నేరములు దళిత స్త్రీలపైన, దళితులపైన చేసిన ఎడల షెడ్యూల్డు కులములు మరియు షెడ్యూల్డు తెగల (అత్యాచారాల) నిరోధక చట్టంలోని సెక్షను 3(2) (V) ప్రకారం శిక్షార్హులు. ఈ చట్టప్రకారం అత్యాచారములకు గురైన బాధితులకు ఈ క్రింది విధమైనటువంటి చర్యలు చేపట్టాలి.

భాధితురాలికి కనీసము రూ. 50,000/- చెల్లించాలి. పరిహారము పరిస్థితులను బట్టి నేర తీవ్రతను బట్టి మారుతుంది. లక్ష రూపాయల వరకూ నష్టపరిహారం ఇవ్వవచ్చు.

ఎ. భాదితులకు ధనరూపేణా, కానీ వస్తురూపేణా లేక రెండింటి రూపేణా తక్షణ పరిహారము అందచేయాలి.

బి. వ్యవసాయ భూమి మరియు ఇంటి స్థలములను కేటాయించుట.

సి. పునరావస చర్యలు

- ఉపాధి
- బాధితుని సాంఘీక, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుట.
- గృహం, ఆహారము, నీరు, దుస్తులు, వైద్య సహాయము, రవాణా సౌకర్యము కల్పించుట మొదలైనవి చెల్లించవలెను.

భారతీయ శిక్షాస్మృతిలో తక్కువ శిక్షలు కలిగిన నేరాలు దళిత స్త్రీలు మరియు దళితుల పట్ల చేసినచో షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల అత్యాచరాల నిరోధక చట్టం 1989 ప్రకారం శిక్షార్హులు. సెక్షన్ 3 ప్రకారం నిందితునికి 6 నెలల నుండి 5 సం॥ల వరకు జైలుశిక్ష విధించబడుతుంది. భాధితులకు నష్టపరిహారం మరియు నేరం యొక్క తీవ్రతను బట్టి పునరావాసం కల్పించబడుతుంది.

గమనిక : కుటుంబ పరిధిలో జరిగే నేరములకు ఎస్సీ/ఎస్టీ (అత్యాచారాల) నిరోధక చట్టం వర్తించదని గుర్తించగలరు.

**స్త్రీలపై నేరం జరిగినపుడు వెంటనే తీసుకోవలసిన చర్యలు :**

1. పోలీసులకు వెంటనే రిపోర్టు చెయ్యాలి.
2. పోలీసుల కిచ్చిన రిపోర్టును జతపరచి ఒక అర్జీని ఎం.ఆర్.ఓకి, సమర్పించాలి లేక పంపాలి.
3. నేరం జరిగిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి వైద్య నిపుణుల చేత పరీక్ష చేయించుకొని ధృవీకరణ పత్రంను పొందాలి.
4. బలమైన సాక్షులను సేకరించాలి.
5. ప్రభుత్వం దగ్గర నుండి నష్ట పరిహారం కొరకు అర్జీ పెట్టాలి.
6. స్త్రీ సంఘాలు ప్రజా సంఘాలతో సంప్రదించి వారి మద్ధతును పొందాలి.

స్త్రీలపై తరుచుగా జరుగుతున్న నేరాలలో ఇవికొన్ని మాత్రమే నేరాలకు సంబంధించి చట్టాలు ఏమి చెబుతున్నవి. శిక్షలు మరియు నష్టపరిహారం గురించి కొంత పరిజ్ఞానం కలిగి ఉన్నపుడు, వారిపై దాడులు జరిగినసమయంలో వారికి ఎటువంటి హక్కులు ఉన్నాయి. వాటిని ఎలా కాపాడుకోవాలి అనే సందర్భంలో పైన పేర్కొన్న చట్టాలలోని నిబంధనలను ఉపయోగించుకోవాలని ఆకాంక్షిస్తుంది. మీ "సాక్షి" దళిత మానవ హక్కుల నిఘా. ●

# దళితులపై జరిగిన అత్యాచార నేరాలు : ఏప్రిల్ - మే 2008

| వ. నెం. | స్థలము | నేరం | తేది / సంఘటన వివరాలు |
|---|---|---|---|
| 1. | హైదరాబాద్ | ప్రేమ పేరుతో మోసం | 4.4.08న సైదాబాద్, కంచన్‌బాగ్ పోలీసుల కథనం ప్రకారం బిఎస్సీ రెండవ సంవత్సరం చదువుతున్న అనిల్‌కుమార్ రెడ్డి చైతన్యపురిలో ప్రైవేటు ఆసుపత్రిలో ఎ.ఎన్.ఎమ్‌గా పనిచేస్తున్న యువతిని మోసగించి అత్యాచారం చేసి, పెండ్లి చేసుకోమని అడిగితే చంపుతానని బెదిరించాడు. |
| 2. | ఆదిలాబాద్ | సామూహిక అత్యాచారం | 7.4.08న గుండంపల్లి (గ్రా), దిలావపూర్ (మం) గ్రామానికి చెందిన నవీన్ రెడ్డి ఇద్దరు గిరిజన మైనర్ బాలికలను భైంసా పట్టణానికి తీసుకువచ్చి అక్తర్, నవీన్, గంగాధర్‌లు బాలికల పై అత్యాచారం చేశారు. |
| 3. | కరీంనగర్ | కులదూషణ | 5.4.08న వెంకట్రావు పల్లి (గ్రా) బోయినపల్లి (మం) గ్రామసర్పంచి నల్లాల మల్లయ్య ఎస్సీ కాలనీలో ఎర్రమట్టిని పోశారు. అదే రోజు వర్షం రావడంతో ఆవీధి బురదమయంగా మారండంలో కూస ప్రతాప్ రెడ్డి దూషించాడు. పోలీసులు కేసు రిజిష్టర్ చేసి, నిందితుని అరెస్ట్ చేశారు. |
| 4. | కడప | దళితులపై పోలీసుల దాడి | పెనగలూరు (మం) ముద్దరపల్లి దళిత వాడలోని చిన్న మరియు అతని తల్లిదండ్రుల మీద కిడ్నాప్ కేసు ఉండడంతో బెయిలు మీద విడుదలయ్యారు. వీరు కువైట్‌కు వెళతారన్న అనుమానంతో వారి ఇండ్లపై పోలీసులు దాడిచేసి, విధ్వంసం సృష్టించారు. |
| 5. | తూర్పుగోదావరి | దళితులపై దాడి | 4.4.08న పోలవరం మండలం కేశనకుర్రలో అగ్రవర్ణాల కు చెందిన కొందరు దళితులపై దాడిచేసి గాయపర్చారు. కారణం మేమనగా కేశనకుర్రు పంచాయితీ పరిధి కన్న పులంకలో జరిగిన లంక మహాలక్ష్మి జాతరలో దళితులను అడ్డుకున్నారు. |
| 6. | గుంటూరు | కులదూషణ దాడి | జెట్టిపాలెం (గ్రా), రెంట చింతల (మం) తాడిపర్తి సాంబశివారెడ్డి వద్ద అదే గ్రామానికి చెందిన రామావత్ ధీనానాయక్ అవసరాల నిమిత్తం కొంత నగదు అప్పుగా తీసుకున్నాడు. పొలం పనికి రావాలని సాంబశివారెడ్డి సోమరవారం దీనానాయక్‌ను కోరాడు. అనారోగ్యం కారణంగాపనికి రాలేనని చెప్పిన నాయక్‌పై రెడ్డిదాడిచేశాడు. అడ్డువచ్చిన అతని భార్య లింగమ్మను కులంపేరుతో దూషించి ఇంకా చిన్నారెడ్డి, సుబ్బారెడ్డి అనువారు కూడా దాడిచేసి, చితకబాదారు. ఎస్.సి, ఎస్.టి కేసు నమోదైంది. |
| 7. | కర్నూలు | ప్రేమ పేరుతో మోసం | బాపురం (గ్రా), కేతాళం (మం), 9వ తరగతి చదువుతున్న వికలాంగ బాలికను బెదిరించి, మోసం చేసి గర్భవతిని చేసిన పకీరప్ప కేసు నమోదయింది. |
| 8. | నెల్లూరు | కులదూషణ | చేజర్ల (మం), ఏటూరు గ్రామ రెవిన్యూ అధికారి అదే గ్రామానికి చెందిన దేవరాలకి కృష్ణయ్య కులంపేరుతో దూషించాడు. ప్రజాపథం పూర్తయిన తర్వాత ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేయడం లేదని అడిగినందుకు జరిగిందని కులం పేరుతో దూషించాడు. |
| 9. | గుంటూరు | కులదూషణ | 8.4.08న నరసరావుపేట, దేచవరం ఆరునాళ్ళలో కులం పేరుతో దూషించి, దాడిచేసిన కేసులో నకిరేకల్లు (మం) దేచవరం గ్రామానికి చెందిన కొండా నాగార్జునరెడ్డి, దొడ్డా సత్యనారాయణ రెడ్డి, నాలి వెంకటేశ్వర్లును పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. |
| 10. | పశ్చిమగోదావరి | అత్యాచార యత్నం | 6.4.08న ఆకివీడు (మం), కుప్పనపూడి గ్రా, శివారు అంకోడు దళితవాడలో నాలుగేళ్ళ బాలికపై బొడ్డు జోషి, కాకరాలఅర్జున్ అనే వ్యక్తులు అత్యాచారానికి యత్నించారు. బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. |
| 11. | కడప | కులదూషణ దాడి | 22.4.08న సిద్దవటం (మం), జ్యోతి గొల్లపల్లి (గ్రా) దళాయి రాములు ఆరోగ్యం బాగాలేనందున, భార్య మరియమ్మ, కుమారుడు గంగాధర్ అతనిని ఆటోలో ఆసుపత్రికి తీసుకుని వెళుతుండగా లక్ష్మారెడ్డి అనే వ్యక్తి ఆటోను ఆపి, మరలా వెళ్ళమన్నారు. అదేమని అడిగినందుకు కులంపేరుతో దూషించి దాడిచేశారు. |
| 12. | మహబూబ్‌నగర్ | కులదూషణ | 21.4.08న పాన్‌గల్ (మం), బుసిరెడ్డి (గ్రా), వార్డుసభ్యుడు చంద్రశేఖర్, సర్పంచ్ నాగశేషయ్యపై నిధులను స్వాహా చేశాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినందుకు నిధుల వినియోగం పై ఆరా తీసినందుకు సర్పంచ్, అతని అనుచరులు రాజు, హుస్సేన్ స్వామి సుధాకర్‌లు, కులపేరుతో దూషించి దాడిచేశారు. |
| 13. | ఆదిలాబాద్ | అత్యాచార యత్నం | 19.4.08న శ్రీరాంపూర్ స్థానిక ఆర్ గుడిసెల ప్రాంతానికి చెందిన ఆశాడపు రమేష్ అనే ఇంటర్ విద్యార్థి తన ఇంటి సమీపంలోని 9వ తరగతి చదువుతున్న ఒక విద్యార్థిని తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఆమెతోఅసభ్యకరంగా ప్రవర్తించి అత్యాచారంకు పాల్పడ్డాడు. |
| 14. | కడప | కులదూషణ ఆత్మహత్య | 17.4.08న అట్లూరు (మం), వేమలూరు గ్రామానికి చెందిన తిరుపాలు వెలుగు కార్యాలయంలో పని చేస్తున్నాడు. అదే కార్యాలయంలో పనిచేస్తున్న సిపిఎం పార్టీకి చెందిన నాయకుడు కులం పేరుతో దూషించాడని దీంతో తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి, ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. |
| 15. | కరీంనగర్ | కులదూషణ | 20.4.08న కరీంనగర్ కార్పోరేషన్‌లో పనిచేస్తున్న కనకం. కొమురయ్య అనే కార్మికుడిని కాంట్రాక్టర్ ఆర్.శ్రీనివాస్ కులం పేరుతో దూషించి, దుర్భాషలాడాడు. |

| | | | |
|---|---|---|---|
| 16 | కర్నూలు | అత్యాచారం | 24.4.08న ప్యాపిలి 14 సం॥రాల బాలికను ఓబులయ్య (24) అనే వ్యక్తి బెదిరించి నోట్లో గుడ్డలు కుక్కి ఆమెను హైదరాబాద్ తీసుకెళ్ళి రెండు రోజులుగా ఒక ఇంట్లో ఉంచి, ఆమెపై అత్యాచారంచేశాడు. ఆమె తల్లిదండ్రులు విషయం తెలుసుకొని బాలికను తీసుకువచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. |
| 17 | హైదరాబాద్ | కులదూషణ ఘర్షణ | 4.5.08న మెహదీపట్నం, అంబేద్కర్‌నగర్‌కు చెందిన మల్లేష్‌ను సంతోష్ కులంపేరుతో దూషించారని ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. |
| 18 | మహబూబ్ నగర్ | కులదూషణ | 25.4.08న మనవోడు ఎస్.సి హాస్టల్ విద్యార్థులను కులంపేరుతో దూషించి అవమానపరిచి బూటుకాలుతో తన్నిన ఎస్.డబ్ల్యూ.డి.డి. శ్రీధర్ పై అట్రాసిటీ కేసు నమోదు చెయ్యాలని తెలంగాణ విద్యావంతుల వేదిక డిమాండ్ చేసింది. |
| 19 | కర్నూల్ | కులదూషణ దాడి | 24.4.08న క్రిష్ణగిరి (మం) కోయిల కొండ గ్రామానికి చెందిన మాదిగ బాలమద్దయ్యను అదే గ్రామానికి చెందిన బోయ బడ్డు యాదన్న, బోయ ఈశ్వరయ్యలు కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డాడు. |
| 20 | కర్నూలు | అంటరానితనం | 22.4.08న ఆదోని మండలంలోని పలు గ్రామాల్లో నేటికీ అంటరానితనం, రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతుందని ఒకవేళ కేసులు పెడితే అధికారులు కలుగచేసుకుని కేసులను నిర్వీర్యం చేస్తున్నారని దీని గురించి అధికారులు స్పందించాలని దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు ఆవేదన వ్యక్తంచేశారు. |
| 21 | ఖమ్మం | దాడి | నేలకొండ పల్లి (మం), మజ్జుగూడెం గ్రామం అన్యాక్రాంతమైన తమ ఇనామ్ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించిన దళితులపై దౌర్జన్యంతో దాడిచేసిన బండి వర్గానికి చెందిన శేఖర్‌తో పాటు మరో 49 మందిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ, ఎట్రాసిటీ కేసులను నమోదు చేశారు. |
| 22 | రంగారెడ్డి | బాలకార్మిక వ్యవస్థ | 24.4.08న సరూర్‌నగర్ మండలంలో బాలకార్మికుల నిర్మూలన చట్టాన్ని ఖాతరు చేయడంలేదు. పలు హోటళ్ళలో బాలకార్మికులు మగ్గుతున్నారు. |
| 23 | అనంతపురం | కులదూషణ దాడి | 2.5.08న రాయదుర్గం (మం), గ్రామదట్ల గ్రామం చేతి పంపువద్ద దళితులు నీరు తెచ్చుకునేందుకు వెళ్ళగా వారినిఅడ్డుకుని అగ్రవర్ణాల వారు దాడిచేసి, కులంపేరుతో దూషించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా డిఎస్‌పి విచారణ చేపట్టారు. |
| 24. | మహబూబ్‌నగర్ | అత్యాచారం బెదిరింపులు | 5.5.08న వనపర్తి పోలీస్ సర్కిల్ పరిధిలో 22ఏళ్ళ గిరిజన వివాహిత మహిళ తన అన్న కిషన్‌నాయక్‌ను ఆస్పత్రిలో పరామర్శించి వస్తుండగా ఆటో కోసం చూస్తున్న ఆమెను ఆటో ఎక్కించుకుని, ఆటకాయించి ఆమెను అత్యాచారం చేసిన దుండగులు, ఎవరికైనా చెప్తే చంపుతామని, బెదిరించి డబ్బుతో ప్రలోభ పెట్టాలని ప్రయత్నించారు. |
| 25. | చిత్తూరు | దాడి | 6.5.08న పశ్చిమగోదావరి జిల్లా, ద్వారాకా తిరుమలకు చెందిన శ్రీనివాసరావు, ఆయన కుమారుడు దుర్గాప్రసాద్ క్రిషింగ్ యంత్రాల మరమ్మతు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అలాగే చిత్తూరులోని దొడ్డిపల్లె సమీపంలో గల శ్రీధర్ అనే యజమాని జల్లి క్రషింగ్ యూనిట్‌లో శుక్రవారం మరమ్మతు పనులు చేశారు. తమకు రావాల్సిన కూలీడబ్బులు అడిగితే, యూనిట్ ప్రతినిధి అంజీ వీరిద్దరిపై దౌర్జన్యం చేసి, వారి బట్టలు ఊడదీశారు. ఇద్దరు నగ్నంగా నడిచివెళ్ళి కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. |
| 26. | ఖమ్మం | బాణామతి పేరుతో దాడి | 8.5.08న భద్రాచలం డివిజన్‌లో ఒక గిరిజన యువకుడిని మంత్రాలు చేస్తున్నడన్న నెపంతో కొంతమంది కలిసి అతనిని చంపి, అతని తలను బావిలో పడవేశారు. ఆ వార్త విన్న అతని భార్య కూడా హఠాన్మరణానికి గురయ్యింది. |
| 27. | కడప | దాడి | 8.5.08న సిద్ధవటం (మం), గొల్లపల్లె గ్రామానికి చెందిన గంగాధర్, రాములు, మరియమ్మ మొ॥ వారిపై దాడిచేసిన అగ్రవర్ణాల వారిని అరెస్టు చేయాలని సిఐటియు కార్యదర్శి డిమాండ్ చేశారు. |
| 28. | రంగారెడ్డి | కులదూషణ దాడి | 9.5.08న పరిగి (మం) చిగురాల్ పల్లి గ్రామంలో దళితులను కులంపేరుతోదూషించి, దాడిచేసిన అగ్రకులాల వారి మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ కేసులు నమోదుచేయాలని, దళితులు అగ్రకులాల కాలనీకి దళితులు రాకూడదని అంటున్నారని వారికి న్యాయంచేయాలని కె.వి.పి.యస్ డిమాండ్ చేసింది. |
| 29. | నెల్లూరు | కులదూషణ | 10.5.08న చిట్టమూరు మం. చిల్లమూరు గ్రామ దళితుడు అద్దూరు వెంకటయ్యను, యాదవ కులస్తులు కులం పేరుతో దూషించి దుర్భాషలాడారని ఫిర్యాదు చేశారు. |
| 30. | నెల్లూరు | అత్యాచారం యత్నం | 12.5.08న విడవలూరు గ్రామ సర్పంచి సమాధి శ్రీనివాసులు రాత్రి సమయంలోని మాస్క్ ధరించి, నగ్నంగా తిరుగుతూ మహిళలపై అత్యాచారాలు చేస్తున్నాడు. అలాగే 19సం॥రాల గిరిజన యువతిపై అత్యాచారం చేయబోయాడు. సర్పంచ్‌పై డిఎస్పీ కేసు నమోదు చేశారు. |
| 31. | నెల్లూరు | కులదూషణ దాడి | జలదంకి (మం), లింగరాజు అగ్రహారానికి చెందిన జిమ్మ్మ మాలకొండయ్య, అతని కుమారుడు కావలి సంకలవారితోటకు చెందిన చేవూరి శివయ్యను కులం పేరుతో దూషించి, కొట్టి గాయపర్చారు. కేసు నమోదయింది. |
| 32. | తూర్పుగోదావరి | కులదూషణ | అల్లవరం (మం), తాడికోన (గ్రా) పుల్లయ్య నాయుడు, వీరకృష్ణారావు రంకిరెడ్డి, రామలింగేశ్వర రావు, అడపా వెంకటేశ్వరరావు మొ॥వారుఅరిగెల బాబ్జీ తనను కులంపేరుతో దూషించారంటూ కోర్టును ఆశ్రయించారు. |
| 33. | కృష్ణా | అత్యాచారం బహిష్కరణ | 19.5.08న గంపలగూడెం మం. చల్లగుండ్లవారి పాలెంలో సాంఘిక బహిష్కరణ కొనసాగుతుంద 6నెలల క్రితం ఒక మహిళపై అదే గ్రామానిక చెందిన మోటకట్ల అంజిరెడ్డి అత్యాచారం యత్నం చేశాడని ఈ కేసులో దళితులు రాజీపడలేదని దళితులను బహిష్కరిస్తున్నారు. |

| | | | |
|---|---|---|---|
| 34 | నల్గొండ | కులదూషణ | 28.5.08న మునగాల (మం), నారాయణగూడెం సారా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న యూత్ సభ్యులను కులంపేరుతో దూషించినందుకు అదే గ్రామానిక చెందిన గోపిరెడ్డి, రామరెడ్డి, గోపిరెడ్డి, వెంకటరెడ్డి, సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలపై కేసునమోదు చేశారు. |
| 35 | మహబూబ్‌నగర్ | అంటరానితనం<br>కులదూషణ<br>దాడి | 21.5.08 ధన్‌వాడ (మం) తిలేరు (గ్రా) గ్రామంలో హోటల్ యజమాని నర్సింములు గౌడ్, కాశిమోళ్ళ రాములు, కుమ్మరి పెంటన్న కలిసిదళితులైన ఎలుకాజు, మహేందర్‌లను కులం పేరుతో దూషించి, తీవ్రంగా కొట్టారు. రెండు గ్లాసులపద్దతిని ప్రశ్నించి నందుకే ఈ దాడి చేశారని తెలిపారు. |
| 36 | హైదరాబాద్ | అత్యాచారం<br>హత్య | 17.5.08 సైదాబాద్, సింగరేణి కాలనీకి చెందిన జయమ్మ (32) వివాహిత, భర్త నుండి దూరంగా ఉంటూ పారిశుద్ధ్య పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మృతిరాలిని గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం చేసి, హత్య చేశారు. |
| 37 | కర్నూలు | దాడి | 8.5.08 కోసిగి (మం), పెద్దభూంపల్లి గ్రామంలో దళితుని చెట్టుకు కట్టేసి చితకబాదిన అంపమ్మ ఆమె కుటుంబ సభ్యులు |
| 38 | కర్నూలు | కులదూషణ | 8.5.08న ఎమ్మిగనూరు (మం) వడ్డే వీధిలోని దళిత మహిళ గంగమ్మను టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ఇసాక్‌కులంపేరుతో దూషించారు. |
| 39 | హైదరాబాద్ | అత్యాచారం<br>బహిష్కరణ | 21.5.08న మూసాపేట దళిత మహిళపై అత్యాచారానికి ఒడిగట్టడంతో పాటు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించిన బాధితులను సాంఘిక బహిష్కరణ చేసిన అగ్రకులస్తులపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. |
| 40 | క్రిష్ణా | దాడి | 31.5.08న గూడూరు మం. మల్లవోలు గ్రా॥ ఎన్.నాగేశ్వరరావు అనే దళిత యువకుడి సైకిల్‌ని దళితేతరుడైన రవీంద్ర తన ట్రాక్టర్‌తో కొట్టాడు. క్షమాపణ చెప్పిమని అడిగినందుకు తన అనుచరులతో కలిసినారాయణ ఈశ్వరరావు, తులశమ్మ మరియు చిన్నలను ఇంట్లో నుండి బయటకు ఈడ్చి కరెంటుస్థంభానికి కట్టేసి, కొట్టారు. కేసు నమోదు అయింది. |
| 41 | నల్గొండ | కిడ్నాప్,<br>అత్యాచారం | 2.6.08న భీక్యాతండా, రామలక్ష్మీపురం, కోదాడ. ఇంటిపై తల్లిదండ్రులతో నిద్రిస్తున్న గిరిజన యువతిని రామలక్ష్మీపురానికి చెందిన అన్నెం, మోహన్‌రెడ్డి నోరు మూసి, క్రిందకు తీసుకువచ్చి సమీపంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. నిందితులలో లక్ష్మారెడ్డి మరో ఇరువురు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదయింది. |
| 42 | రంగారెడ్డి | కులదూషణ | 27.5.08న గండీడ్, మహ్మదాబాద్, మన్సుర్‌పల్లి తండాకు చెందిన కెత్యావత్ కమిలి బాయికి, సల్కర్‌పేట్ గ్రామానికి చెందిన గోవిందరెడ్డికి మధ్య పొలాల్లో బోరు వద్ద వివాదంలో గోవిందరెడ్డి కమిలిబాయి మరియు ఆమె తోటి కోడలు లక్ష్మిని దుర్భాషలాడి, కులం పేరుతో దూషించాడు. కేసు నమోదయింది. |
| 43 | రంగారెడ్డి | బాణామతి<br>పేరుతో దాడి | 27.5.08న ఇబ్రహీంపట్నం, మంచాల పిఎస్ లోయపల్లి గ్రా, ఈరేటి అంజమ్మ (25)అనే మహిళను మంత్రగత్తె అని, చేతబడులు చేస్తుందనే నెపంతో ఆమెను వివస్త్రను చేసి, స్థంబానికి కట్టేసి కొట్టిన గ్రామస్తులు కేసు నమోదయింది. లోయలపల్లి గ్రామస్తులకు డిసిపి కౌన్సిలింగ్ ఇచ్చారు. |
| 44. | మెదక్ | మంత్రాల నెపంతో<br>దాడి | 27.5.08న జిన్నారం (మం), సోలక్‌పల్లి (పం), ఇమాంనగర్ (గ్రా), నర్సింలు అనే వ్యక్తి అర్ధరాత్రి సమయంలో నగ్నంగా తిరుగుతున్నాడనే నెపంతో మంత్రాలు తంత్రాలు అనే భ్రవ మేరకు గ్రామస్తులు అతన్ని చితకబాదారు. |
| 45. | కర్నూలు | దళిత కార్యకర్తను<br>దూషించి దాడి<br>చేసిన మాజీ ఎంపిపి | 26.5.08న కలెక్టరేట్, టి.ఆర్.ఎస్. దళిత కార్యకర్త బెజ్జం మాజీ ఎంపిపి ములుగు విజయ్‌కుమార్‌ను మాజీ మంత్రి పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, అతని అనుచరులు అసభ్యంగా దూషించి, తీవ్రంగా గాయపరిచారు. |
| 46. | ఖమ్మం | కులదూషణ | 24.5.08న పెనుబల్లి (మం), లింగగూడెం, పిహెచ్‌సి సబ్‌సెంటర్‌లో 11 ఏళ్ళుగా ఎంపిహెచ్‌ఎ (ఎఫ్) గా పనిచేస్తున్న కొమ్ముల విజయభారతిని, లంకాసాగర్ పిహెచ్ సి.వైద్యుడు వేణుమాధవ్ కులం పేరుతో దూషించాడని పై అధికారులకు ఫిర్యాదు చేసింది. |
| 47. | మెదక్ | సాంఘిక<br>బహిష్కరణ | చిన్నకోడూరు, దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిబిఎఫ్, ఎం.డి.ఎస్.ఎస్. ఎబిఎస్‌ఎఫ్ సంఘాలు శనివారం డిమాండ్ చేశారు. |
| 48. | చిత్తూరు | కులంపేరుతో<br>దూషించిన<br>తహసీల్దార్ | 23.5.08న కదిరి, ముదిగుబ్బలో చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగించే పది మంది దళితులు తమకు ఎక్కడైనా మిగులు లేదా అసైన్డ్ భూములు ఇస్తే వ్యవసాయం చేసుకునికుటుంబాలను పోషించుకుంటామంటూ గత ఏడాది ఏప్రిల్ 18న పెనుగొండ ఆర్డీఓకు అర్జీనిఇచ్చారు. దీనిపై విచారణ జరిపి అర్హులైన వారికి అసైన్డ్ భూమిని మంజూరుచేయాలని ఆయన తహసిల్దార్‌ను ఆదేశించారు. తమకు పట్టాదారు పాసు పుస్తకాలైనా ఇవ్వాలని లేని పక్షంలో తాము లంచంగా ఇచ్చిన డబ్బును వాపస్ చేయాలని ప్రశ్నించారు. దీంతో తహసీల్దార్ కులం పేరుతో దూషిస్తూ, అక్కడ నుండి మెదపట్టి బయటకు గెంటాలని క్రింది స్థాయి సిబ్బందిని ఆదేశించారు. అక్కడే ఉన్న ఎస్సై కేసు తీసుకోలేదని విలేఖరులకు వివరించారు. |
| 49. | కర్నూలు | బహిష్కరణ | 24.5.08న గంపలగూడెం (మం), చల్లగుండ్ల వారిపాలెంలో సాంఘిక బహిష్కరణ కేసులోఅక్కడి దళితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 7గురిని అరెస్టు చేసినట్లు డిఎస్పి జి. నారాయణ తెలిపారు. |
| 50. | నల్గొండ | హత్య | 4.5.08న, తిప్పర్తి (మం), అనిశెట్టి దుప్పలపల్లి గ్రామానికి చెందిన పేర్ల సవిత దళిత విద్యార్థినిని ప్రేమపేరుతో వేధించి, హత్యచేసిట్లుగా పేర్ల ప్రవీణ్ మరియు చరియాల నాగాచారిల మీద కేసు పెట్టిన తల్లిదండ్రులు. |

| | | | |
|---|---|---|---|
| 51. | కర్నూలు | కులదూషణ దాడి | 25.5.08న నూనెపల్లి, గోస్పాడు (మం), చింతగుంట్ల గ్రామంకు చెందిన ఎస్.సి మహిళ రాణెమ్మ పై అదే గ్రామానికి చెందిన బోయ సుబ్బరాయుడు అతనిభార్య నర్సమ్మలు కలిసి కులం పేరుతో దూషించి, దాడిచేసి గాయపరచారని ఎస్.ఐ. ప్రవీణ్ తెలిపారు. |
| 52. | మెదక్ | మంత్రాల నెపంతో దాడి | 23.5.08న జగదేవ్‌పూర్ (మం), లీగల్ నర్సాపూర్ గ్రామపంచాయితీ ఆమ్లెట్ గ్రామమైన జంగంరెడ్డి పల్లి అంతాయగూడ గ్రామానికి చెందిన హేయ సత్తయ్య (40) అనే వ్యక్తిని జంగంరెడ్డి పల్లికి చెందిన యాదగిరి అతని 6గురు స్నేహితులు మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో అతనిని కొట్టి, బాధితుని అతని భార్య కుమారులను 12 గంటల పాటు నిర్బంధించారు. ఎస్.పి వారిని విడిపించారు. |
| 53. | మెదక్ | దళితులపై వివక్షత | 22.5.08న న్యాల్‌కల్ (మం), ఇందిరమ్మ ఆదర్శ గ్రామమైన రాఘవపూర్‌లోని దళితవాడలో నిర్మించిన వాటర్ ట్యాంక్ నిర్మించి ఏడాది గడుస్తున్నా గ్రామంలోని బోరు నుండి నీటిని ట్యాంక్ లోనికి సరఫరా చేయడం లేదు. చేతి పంపు సైతం గత ఏడాది కాలంగా మరమ్మతుకు నోచుకోలేదు. తాగునీటికై దళితులు ఎన్నో పాట్లు పడుతున్నారు. |
| 54. | విశాఖపట్నం | కులదూషణ దాడి | 23.5.08న నక్కపల్లి, దేవవరం ఇంటిస్థల విషయంలో బచ్చుల విఘ్నేశమ్మను ఆమె బంధువులైన అదే గ్రామానికి చెందిన గొలగాన విఘ్నేశు, రమణ మామాడి తాతారావు, చెల్లపు సత్యనారాయణలతో ఘర్షణ పడి కొట్టి కులం పేరుతో దూషించారని చెబుతూ మే 28న నక్కపల్లి స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్‌పి తెలిపారు. |
| 55. | తూర్పుగోదావరి | కులదూషణ | 31.5.08న అమలాపురం, సమనస గ్రామానికి చెందిన గోడ రాజ్‌కుమార్‌ను అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కులం పేరుతో దూషించి, దాడిచేశారు. |
| 56. | శ్రీకాకుళం | కులదూషణ | 31.5.08న పలాస-కాశీబుగ్గ మోగాపు గాంధీ అనే వ్యక్తి కూర్మాపు క్రిష్ణమూర్తిని కులంపేరుతో దూషించాడు. |
| 57. | మెదక్ | సాంఘిక బహిష్కరణ | 01.6.08న సంగారెడ్డి అర్బన్, పెద్ద కోడూరు, గ్రామంలో దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన అగ్రవర్ణ పెత్తందార్లు. |

**దళిత, కవులకు, రచయితలకు / రచయిత్రులకు**

**ఆహ్వానం**

**దళిత సాహిత్యం, అంబేడ్కరిజం, మొదలైన అంశాలపై తమ కవితలను, వ్యాసాలను, సాహిత్యాన్ని క్రింద తెలిపిన సాక్షి అడ్రస్‌కి పంపవలసిందిగా ఆహ్వానిస్తున్నాము.**

**సాక్షి**, మానవ హక్కుల నిఘా

**అత్యవసర సమాచారాన్ని అందించడానికి ఉచిత ఫోన్ నెంబరు వినియోగించుకోండి.**

**1800 4255535, 27737093**

బి.ఎస్.ఎన్.ఎల్. నంబర్ల నుండి ఉచితంగా దళిత కాల్ లైన్‌కు ఫోన్ చేసి, రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న అత్యాచారాల గురించి **సాక్షి** మానవ హక్కుల నిఘాకు తెలుపవలసింది గా కోరు చున్నాము.

**సాక్షి**, మానవ హక్కుల నిఘా


**మీ అభిప్రాయాలను కింది చిరునామాకు పంపండి.**

**సాక్షి** హ్యూమన్ రైట్స్ వాచ్, ఎ.పి.

ఇం.నెం. 10-3-129, IInd ఫ్లోర్, టీచర్స్ కాలనీ, లేన్ నెం. 4, స్ట్రీట్ నెం. 3, ఈస్ట్ మారేడుపల్లి, సికింద్రాబాద్ - 500 026.

ఫోన్ : 040 - 65440969 ఫ్యాక్స్ : 040 - 27737086

ఇ-మెయిల్ : Sakshi_ap@satyam.net.in వెబ్‌సైట్ : www.sakshiap.org

**Toll Free Dalit Call No - 18004255535, 27737093**



Published by **V. Nanda Gopal,** Director, Sakshi Human Rights Watch, A.P. Secunderabad - 500 026.